# ఇరువదిమూడవ ప్రసంగము

ఛందూభాయి, శాస్త్రీజీ! రేవాశంకరభాయీ! ఇరువురు గోండలు, రాజకోట మొదలగుచోట్లకు వెళ్లిపోయిరి. స్వామి శ్రీ ప్రకాశానందులవారు పీరడియాలోనే ఉండిరి. ఆరాత్రి స్వామి శ్రీనిత్యానందులవారు, ప్రకాశానందులవారు, వైద్యరాజు మొదలగువారు కూర్చునియుండిరి. వైద్యరాజు ప్రశ్నించెను.

వైద్య:—"నేను చాలరోజులనుండి వేదాంతశ్రవణము చేయుచున్నాను. కాని జ్ఞానము కలుగుటలేదు. కారణమేమి?"

స్వా. ప్ర. :—(స్వా. ని. వారితో) తమరు దయయుంచి సెలవివ్వండి. నేనుకూడ తమ శ్రీముఖమునుండి వినగోరుచున్నాను.

వాసనా భేదములు : శుద్ధవాసన, మలినవాసన.

స్వా. ని. :—"న శ్రవణమాత్రాత్ తత్సిద్ధిరనాదివాసనాయా బలవత్త్వాత్ ।"

"వాసన అనాదికాలమునుండి బలవత్తరముగానుండుటచే శ్రవణమాత్రమున జ్ఞానము సిద్ధించదు" అని సాంఖ్యసూత్రములు చెప్పుచున్నవి.

వాసనాలక్షణమును వసిష్ఠులు చెప్పిరి.

"దృఢభావనయా త్యక్తపూర్వాపరవిచారణమ్ ।
యదాదానం పదార్థస్య వాసనా సా ప్రకీర్తితా॥"

"దృఢభావముతో పూర్వాపరములను విచారించకుండ పదార్థములను గ్రహించుట వాసన."

వాసన రెండు రకములు:—1. మలిన వాసన, 2. శుద్ధవాసన, మలినవాసనను వసిష్ఠులు ఇట్లు వర్ణించిరి.

అజ్ఞానసుఘనాకారా ఘనాహంకారశాలినీ ।
పునర్జన్మకరీ ప్రోక్తా మలినా వాసనా బుధైః ॥

"బ్రహ్మస్వరూపమును ఆవరించు అజ్ఞానముతో దట్టమైన ఆకారము కలదియును, ఘనమగు అహంకారముతో నిండినదియును అగు వాసనను మలినవాసన అనెదరు. ఈ మలినవాసనద్వారా మనుష్యునకు పునర్జన్మ కలుగును."

## మలినవాసనా భేదములు

జన్మనిచ్చు వాసనాభేదములు అనంతములు. అయినను శాస్త్రములలోని మలినవాసన మూడురకములు. 1. లోకవాసన, 2. శాస్త్రవాసన, 3. దేహవాసన.

ఈ మూడు వాసనలలోను ఏఒక్కవాసన ఉన్నను ఆవాసనా ప్రతిబంధకారణముచే యథార్థమగు ఆత్మజ్ఞానము కలుగదు.

## లోకవాసన.

"జనులందరు నన్ను స్తుతించు పనులనే నేను చేయవలెను, వారినిందను నేను పొందరాదు." అను పట్టుదలను కలిగియుండుట లోకవాసన. ఈలోకవాసనను నూరుజన్మము లెత్తినను పూర్తిచేసికొనలేము. కావున ఇతరుల నిందాస్తుతులను లెక్కపెట్టకుండ అధికారియగు నరుడు సమభావమును పొందియుండి తన హితమును కోరవలెను. ఈవిషయమున ఈదృష్టాంతము చెప్పదగినది.

ఒకగ్రామమున ఒకవ్యాపారి యుండెను. అతడు పప్పుదినుసులు అమ్మెడివాడు. వడ్డీవ్యాపారముకూడ కలదు. జనులందరు అతనిని భక్తుడు అని పిలచెడివారు. ఈభక్తుడు చాల నమ్మకమైనవాడు. అతనివద్దనే అందరును తమకు కావలసిన సామానులన్నియు తీసికొనెడివారు. ఆతనివ్యాపారము చాల మిక్కుటముగా సాగెడిది. ఆ గ్రామమునందలి ఒకానొకవ్యక్తి వ్యాపారముచేయుటకు ఇతరదేశము

ములకు వెళ్ళెను. భర్తలేని రోజులలో భార్య ఈభక్తుని దుకాణము మీదనే సరకులు అన్నియును తీసికొనెడిది. కొన్ని రోజులతరువాత ఆతడు ఇతరదేశమునుండి తాను సంపాదించిన ద్రవ్యముతో ఇంటికి వచ్చెను. ఆతడు తనతో ఒక వేయి కాసులుకూడ తీసికొని వచ్చి యుండెను. వాని నాణ్యమును విలువకట్టించుటకు ఆతడు మనభక్తుని వద్దకు తీసికొని వచ్చెను. భక్తుడు లెక్కపెట్టి అందులో రెండుకాసులు తక్కువ అని చెప్పెను.

పరదేశమునుండి వచ్చిన వ్యక్తి పలికెను. నేను వెయ్యి కాసులు తెచ్చితిని. తక్కువ ఎట్లుండును? ఇట్లని అతడు కోపముతో భక్తుని డబ్బుపెట్టెను లాగి చొక్కా వెతికెను. ఆపెట్టెలో రెండు కాసులు ఉండెను. అంతట అతడు బిగ్గరగా అరచి చెప్పసాగెను. "దొంగ, దొంగ." ఆతడు అందరను ప్రోగుచేసి ఆలోచించకుండ ఆభక్తుని తిట్టుచు ఇట్లు చెప్పసాగెను. "చూడండయ్యా! భక్తాగ్రేసరుడట! భక్తులంటే ఇల్లాగ ఉండవలెను." గ్రామమంతా తెలిసిపోయెను. ఇంతలో ఈవార్త పరదేశమునుండి వచ్చినవాని భార్యకు తెలిసెను. ఆమె ఒకనౌకరుద్వారా ఇట్లు కబురుపంపెను. "ఆభక్తుడు దొంగకాడు. మీరు లేనప్పుడు ఇంటికి కావలసిన సామానులన్నియు మేము ఆతనివద్ద తీసికొంటిమి. వారికి డబ్బు ఇవ్వవలసియుండెను. కావున మీరు తెచ్చిన వెయ్యికాసులలోనుండి రెండుకాసులు అతనికి ఇచ్చితిమి. ఇది వినినతోడనే ఆతనికి చాల పశ్చాత్తాపము కలిగెను. ఆతడు భక్తుని క్షమించమని ప్రార్థించెను. అంతవరకు తిట్టుచున్న ఇతరులుకూడ భక్తుని స్తుతించసాగిరి. భక్తుడు భక్తుడే అనిరి.

జనులు ఇటులనే ఆలోచించకుండ మాట్లాడెదరు. వెనుకముందులు చూడకుండ నిందించెదరు.

భక్తుడు దుకాణమునుండి క్రిందికి దిగి చేతులలోనికి దుమ్ము తీసికొని ఇట్లు పలికెను. "నన్ను పొగడినవారి తలపై ఈదుమ్ము

పోయుచున్నాను. నన్ను నిందించినవారితలపై ఈడుమ్ము పోయుచున్నాను."

శాస్త్రములుకూడ చెప్పుచున్నవి.

*విద్యతే న ఖలు కశ్చిదుపాయః సర్వలోక (పరి) తోషకరో యః।*
*సర్వథా స్వహితమాచరణీయం కిం కరిష్యతి జనో బహుజల్పః ॥*

"ప్రజలందరిచేతను స్తుతిని పొందు ఉపాయము ఈలోకమునందలి ఏశాస్త్రమునందును లేదు. అధికారియగువాడు లోకవాసనను త్యజించి, సర్వవిధముల తనకు హితముకలుగునట్లు సంచరించవలెను. జనుల నిందాస్తుతులయందు శ్రద్ధను చూపరాదు. ఈలోకులు చేయు నిందాస్తుతులచే లాభనష్టములు కలుగవు."

## శా స్త్ర వా స న

అనేక శాస్త్రములను అధ్యయనము చేయవలెనను వాసన శాస్త్రవాసన. ఇది మూడు రకములు:- 1. పాఠవ్యసనము, 2. బహుశాస్త్రవ్యసనము, 3. అనుష్ఠానవ్యసనము.

1. శాస్త్రములన్నియు చదివి పూర్తిచేయవలెనను కోరిక పాఠవ్యసనమను వాసన. ఆవిధముగా ఎవరును చేయలేరు. అందుచేతనే అది మలినవాసన. భారద్వాజుడు మూడు పురుషాంతరములు (75 సంవత్సరములు) అధ్యయనము చేసినను శాస్త్రములు పూర్తి అవలేదు. ఇంద్రుడు అతనికి మరియొక పురుషాంతరము (25 సంవత్సరములు) సమయము ఇచ్చెదనని ఆశపెట్టెను. భరద్వాజుడు ఆ 25 సంవత్సరములలోనుకూడ వేదాధ్యయనముచేయుటకు ప్రయత్నించెను. కాని శాస్త్రాధ్యయనము పూర్తికాలేదు. ఈసంగతి ఇంద్రుడు భరద్వాజునకు తెలుపగా నాతడు అధ్యయనమును త్యజించి ఇంద్రుని ఉపదేశముచే సగుణబ్రహ్మోపాసనమును ఆరంభించెను. కావుననే విద్వాంసులు చెప్పిరి.

అనన్తశాస్త్రం బహువేదితవ్యమల్పశ్చ కాలో బహవశ్చ విఘ్నాః।
యత్సారభూతం తదుపాసితవ్యం హంసో యథాక్షీరమివామ్బుమిశ్రమ్॥

శాస్త్రములు అనంతములు. శాస్త్రప్రతిపాదితములగు అర్థములుకూడ అనంతములు. పదార్థజ్ఞానము అల్పకాలమున కలుగదు. కాని మానవాయుర్దాయము చాలతక్కువ. ఈచిన్న ఆయుర్దాయమునందే రోగాదులు అనేకవిఘ్నములు కలుగును. ఇట్లు విఘ్నములతో కూడిన చిన్న ఆయుర్దాయముద్వారా సర్వశాస్త్రములను అధ్యయనముచేయుట అసంభవము. కావున హంస నీరుకలసిన పాలనుండి క్షీరమునుమాత్రమే గ్రహించునట్లు అధికారి సర్వశాస్త్రసారభూతమగు పరమాత్మని యథార్థజ్ఞానమను అర్థమును గ్రహించవలెను.

2. అభ్యాసముకొరకు అనేకవిధములగు శాస్త్రములను వెతకుట బహుశాస్త్రవ్యసనము. ఈవ్యసనము దూర్వాసునియందు ఉండెను. దూర్వాసుడు అనేకశాస్త్రముల భారముతో శంకరుని నమస్కరించుటకు వెళ్ళుచుండెను. నారదుడు సభలో అందరియెదుట ఆతడు బరువుమోయు గాడిదతో సమానుడని పలికెను. దూర్వాసునకు క్రోధము వచ్చి ఆభారము అంతయు క్షీరసముద్రమున పారవేసెను. అటుతరువాత ఆతడు శంకరుని దర్శించెను శంకరుడు ఆతనికి ఆత్మవిద్యోపదేశము చేసెను. కావున అనేకరకములగు గ్రంథములను సంగ్రహించుట అనెడు మలినవాసనను కూడ ముముక్షువు త్యజించవలెను.

3. వేదశాస్త్రములయందు విధించబడిన కర్మానుష్ఠానమందే ఆయుష్యమంతయును గడపుట అనుష్ఠానవ్యసనము అనబడును. ఈఅనుష్ఠానవ్యసనము నిదాఘుడను రాజుయందు ఉండెను. ఋభుడను ముని ఆతనికి ఎంతైనను నచ్చచెప్పెను. అయినను ఆతడు కర్మలయందు శ్రద్ధ అను జడత్వమును విడనాడలేదు. దాశూరుడు అనేవానికి తన

కర్మానుష్ఠానమునకు వలయు పవిత్రప్రదేశము భూమియందు ఎంత వెదకినను ఎక్కడను దొరకలేదు. ఈకర్మవాసన పునర్జన్మకు కారణము. కావున మలినమైనది. శాస్త్రవాసనకూడ దర్పాదులకు కారణమగుటచే పరమార్థతత్త్వము తెలిసికొను నంతవరకు మాత్రమే శాస్త్రాధ్యయనము ఆచరణీయము.

## దేహవాసన.

1. దేహాత్మత్వము 2. గుణాధానము 3. దోషాపనయనము అని భ్రాంతిభేదమున దేహవాసన మూడు రకములు.

1. దేహమునందు ఆత్మత్వబుద్ధిని దృఢపరచి దానినే పోషించుచుండుట దేహాత్మత్వము. "విరోచనునకు ప్రజాపతి పరమార్థతత్త్వమును ఉపదేశించెను. అయినను అతడు తనచిత్తమునందలి దోషముచె దేహమునందే ఆత్మభావమును స్థిరపరచి అసురులందరకును దేహమే ఆత్మ అని బోధించెను." అని ఛాందోగ్యోపనిషత్తునందు ఉన్నది. ఈనాడు విరోచనమతానుయాయులు చాలమంది కానగుదురు. తమశరీరమును పోషించుటయందు తత్పరులయి, భక్ష్యాభక్ష్యములను, గమ్యాగమ్యములను విచారించకుండ కేశరచనాదులద్వారా విచిత్రములగు వెషములను వేసికొని విలాసములను అనుభవించువారు అందరును విరోచనమతావలంబులే.

అది సరియగు మతము కాదు. ఏలనన;"ఆత్మ అనగా జీవాత్మ దేహముకంటె భిన్నమైనది." అనునది జ్ఞానుల అనుభవము. ఈ శరీరము మలమూత్రములతో నిండియున్నది. క్షణభంగురము. కావున ఒకరోజున విసరివేయవలసినదే. అయినను దానిని అందముగాను, బలముగాను ఉంచుటకు రకరకములగు ఔషధములను ఉపయోగించెదరు. దేహమునకు క్షణికములగు విలాసవైభవములు కలుగజేయుటకు ద్రవ్యాధిసాధనములను సంపాదించుటకై నీతి, అవినీతి,

న్యాయము, అన్యాయము అనునవి కూడ విచారించుట కనబడుట లేదు. ఎవరికైనను దుఃఖము కలిగినను లక్ష్యముచేయక ధనమును సంపాదించినకాని క్షుద్రములగు వైభవములు అనుభవించలేక పోవుచున్నాము కదా! కావున మృత్యువు లేని ఆత్మను పొందుటకు ఎంత గొప్పపురుషార్థము చేయవలెనో యోచింపుడు.

2. గుణాధానము రెండురకములు. 1. లౌకికము 2. వైదికము.

కోమలమగు కంఠముతో గానముచేయుటకును, వేదాదులను చదువుటకును కంఠమును బాగుచేసికొనుటకు ఔషధాదులను సేవించుచుందురు. అటులనే శరీరమునకు పుష్టికరఔషధములను సేవించుట, ఆహారమును తినుట, సౌందర్యముకొరకు సుగంధతైలములను పట్టించుట, సుందరవస్త్రాదిభూషణములను ధరించుట, సువాసనకల అత్తరులు, సెంట్లు మొదలగువాటిని ఉపయోగించుట ఇవి అన్నియును లౌకికములగు గుణాధానములు. పుణ్యముకొరకు గంగాస్నానాదులు చేయుట, సాలిగ్రామాదులు సంపాదించుట మొదలగునవి వైదిక గుణాధానములు.

3. దోషాపనయనము. అనగా దోషములను పోగొట్టుట కూడ లౌకికము, వైదికము అని రెండురకములు. చికిత్సాశాస్త్రమున చెప్పబడిన ఔషధములద్వారా శరీరమునందలి దోషములను పోగొట్టుట లౌకికము. శౌచ, ఆచమనాదులద్వారా పవిత్రమగుట వైదికము.

ఈదేహవాసన జ్ఞానప్రతిబంధకము. కావున ముముక్షువు దీనికి దూరముగా నుండవలెను.

## దేహవాసనానివృత్తికి ఉపాయము.

ఈవిషయమున శంకరభగవత్పాదులు చెప్పిరి.

*సంసారబన్ధవిచ్ఛిత్త్యై తద్ద్వయం ప్రదహేద్యతిః।*
*వాసనావృద్ధిరేతాభ్యాం చిన్తయా క్రియయా బహిః॥*

"సంసారము (జన్మమరణరూపసంసారము) అను బంధమును నశింపజేయుటకు విషయచింతన, విషయప్రవృత్తి ఈరెంటిని సాధకుడు దహించివేయవలెను. విషయచింతన, విషయప్రవృత్తి ఈరెండింటితోను వాసన వృద్ధిని పొందును."

ఎట్లన, మీావద్ద ఒక గుర్రపుబండి ఉన్నచో రెండు గుర్రపుబండ్లు కావలెనని తలచుట విషయచింతన. ఆప్రకారము రెంటిని సంపాదించి దానియందు కూర్చొనుట బాహ్యక్రియ. ఈబాహ్యక్రియయే విషయభోగము. దానితోనే వాసన వృద్ధిపొందును. కావున పైమూాడింటిని ఏదోవిధముగా నశింపజేయవలెను.

*తాభ్యాం ప్రవర్ధమానా సా సూతే సంసృతిమాత్మనః ।*
*త్రయాణాం చ క్షయోపాయః సర్వావస్థాసు సర్వదా॥*

"ఈరెండును పెరిగినకొలదియు వాసన ఆత్మను జనన మరణములనెడు సంసారముతో చేర్చును. ఈ దేహవాసనలు మూాడింటిని నశింపజేయుటకు సర్వకాలసర్వావస్థలయందును ప్రయత్నించవలెను."

పాముకు పాలు త్రాగించినకొలదియు దాని విషము పెరుగును. అటులనే విషయములయందు ప్రవర్తించినకొలదియు దేహవాసన పెరుగును. "దేహమే నేను" అను భావము దృఢపడును. కావున ఈదేహవాసనను పరిత్యజించుటతో బాటు శుభవాసనను అనుష్ఠించవలెను.

*సర్వత్ర సర్వతః సర్వం బ్రహ్మమాత్రావలోకనైః।*
*సద్భావవాసనాదార్ఢ్యాత్ త్రితయం లయమశ్నుతే॥*

"అన్నిటియందును, అన్నివిధములుగను, అంతయును బ్రహ్మమే నని చూచుటచే బ్రహ్మభావము అను వాసన దృఢపడి పైన చెప్పిన మూాడును నశించును."

అనగా సర్వము బ్రహ్మమే అను అభేదోపాసనచే జగము నందలి పదార్థములయందలి రాగద్వేషములు నశించుటచే క్రియ, ఇచ్ఛ, వాసన ఈమూడును నశించును.

శుద్ధవాసనాలక్షణము యోగవాశిష్ఠమునకూడ చెప్పబడినది—

పునర్జన్మాఙ్కురం త్యక్త్వా స్థితం సంభృష్టబీజవత్ ।
దేహార్థం ధ్రియతే జ్ఞాతజ్ఞేయా శుద్ధేతి చోచ్యతే॥

"జననముయొక్క మూలమును నశింపజేసి, జ్ఞేయతత్త్వము యొక్క జ్ఞానము లభింపజేయు వాసన మొలచిన బీజమువంటిది. అది శుద్ధమగు వాసన."

మలినవాసన నశించువరకు తత్త్వజ్ఞానము కలుగదు.

**తత్త్వజ్ఞానము, వాసనాక్షయము అన్యోన్యాశ్రియములు.**

"ఈదృశ్యమానమగు సర్వప్రపంచమును మిథ్య. అద్వితీయుడగు ఆత్మ పరమార్థరూపుడు. కావున ఆత్మ స్వరూపుడు. ఆత్మకు భిన్నమగు పదార్థము వేరొకటి లేదు" అనునది తత్త్వజ్ఞానము. ఈ తత్త్వజ్ఞానోపపత్తి- సిద్ధి కలిగినప్పుడు విషయాభావముచే వాసనాక్షయము అగును. తత్త్వజ్ఞానాభావము ఉన్నంతవరకు అనగా తత్త్వజ్ఞానము కలుగనిదే పదార్థములయందలి సత్యత్వప్రతీతి నివృత్తి నిపొందదు. వాసనాప్రవాహము అంతకంతకు ముందుకు సాగుచునే యుండును. ఈవిధముగా వాసనాక్షయమునకు తత్త్వజ్ఞానము కారణము. దేహవాసనాది మలినవాసనలచే చంచలమగు చిత్తమునందు ఆత్మజ్ఞానము కలుగు యోగ్యత లేదు ఇట్లు తత్త్వజ్ఞానమునకు వాసనాక్షయముకూడ కారణమే.

తత్త్వజ్ఞానమునకు రెండు రకములగు సాధనములు కలవు.
1. అంతరంగసాధనములు, 2 బహిరంగసాధనములు.

యజ్ఞయాగాదులు బహిరంగసాధనములు. వివేకాదులు అంతరంగసాధనములు ఎనిమిది. అందును వివేకము, వైరాగ్యము, షట్ సంపత్తి, ముముక్షుత్వము అను వానికంటె శ్రవణము, మననము, నిదిధ్యాసనము ఎక్కువ అంతరంగికములు. అంతకంటెను "తత్త్వమసి" అను మహావాక్యముచే "తత్" పదముయొక్కయు, "త్వం" పదముయొక్కయు అర్థమును శోధించుట ఎక్కువ అంతరంగికము.

వివేకాదుల లక్షణములను అపరోక్షానుభూతియందు శంకరులు వ్రాసిరి.

*నిత్యమాత్మస్వరూపం హి దృశ్యం తద్విపరీతగమ్ ।*
*ఏవం యో నిశ్చయః సమ్యగ్వివేకో వస్తునః స వై ॥*

"ఆత్మస్వరూపము నిత్యము. దృశ్యమగునది దానికి విపరీతము. ఈవిధముగా పదార్థనిశ్చయము వివేకము."

ఆత్మ సాక్షి. ఆత్మ సత్, చిత్, ఆనందస్వరూపము. దృశ్యములు అనగా దేహేంద్రియాదులు. వానికి విపరీతములగు స్వభావము కలవి అసత్ పదార్థములు, జడములు, దుఃఖరూపములు. ఈవిధముగా సంశయములేని నిశ్చయము కలుగుటయే వివేకము.

*బ్రహ్మాదిస్థావరాన్తేషు వైరాగ్యం విషయేష్వను।*
*యథైవ కాకవిష్ఠాయాం వైరాగ్యం తద్ధి నిర్మలమ్ ॥*

"బ్రహ్మ మొదలు స్థావరపదార్థమువరకును కల విషయములయందు రాగమును పొందకుండ వానిని కాకిరెట్టతో సమానముగా చూచుట శుద్ధవైరాగ్యము."

శాస్త్రకారులు విషయములను కాకి, కుక్క, పంది మొదలగువాని మలములతో పోల్చిరి. ఏలనన ఆయాజీవులు మలమును భక్షించును. కావున అవి మలముయొక్క మలము అగుటచే అత్యంత నిషిద్ధము.

*సదైవ వాసనాత్యాగః శమోయమితి శబ్దితః।*
*నిగ్రహో బాహ్యవృత్తీనాం దమ ఇత్యభిధీయతే॥*

"ఎల్లవేళలయందును వాసనను త్యజించుట 'శమము' అనబడును. బాహ్యేంద్రియ నిగ్రహము 'దమము' అనబడును."

లోకవాసన, దేహవాసన శాస్త్రవాసన, వీనిని త్యజించి విషయములవైపునకు పరుగెత్తు చిత్తమును నిగ్రహించు సామర్థ్యమును శమము అందురు. శ్రవణాది జ్ఞానేంద్రియములను వాగాదికర్మేంద్రియములను నిషిద్ధప్రవృత్తుల నుండి మరలించుట దమము అనబడును.

*విషయేభ్యః పరా వృత్తిః పరమోపరతిర్హి సా।*
*సహనం సర్వదుఃఖానాం తితిక్షా సా శుభా మతా॥*

"విషయములనుండి నివృత్తిని చెందుట శ్రేష్ఠమగు ఉపరతి. దుఃఖములను అన్నిటిని సహించుట శుభకరమగు తితిక్ష."

*నిగమాచార్య వాక్యేషు భక్తిః శ్రద్ధేతి విశ్రుతా।*
*చిత్తైకాగ్ర్యం తు సల్లక్ష్యే సమాధానమితి స్మృతమ్॥*

"శ్రుతులయందును, సద్గురువుల వాక్యములయందును నమ్మకము 'శ్రద్ధ' అనబడును. సద్రూపమగు లక్ష్యమునందు చిత్తమును ఏకాగ్రముగా నుంచుట 'సమాధానము' అనబడును."

వీనితరువాత వారు 'ముముక్షుత్వ' లక్షణమును కూడ చెప్పిరి.

*సంసారబన్ధనిర్ముక్తిః కథం మే స్యాత్ కదా విధే।*
*ఇతి యా సుదృఢా బుద్ధిర్వక్తవ్యా సా ముముక్షుతా॥*

"ఓ దైవమా! సంసారమను బంధమునుండి నాకు ముక్తి ఎట్లు కలుగును అను దృఢమగు భావము ముముక్షుత్వము."

సంసారబంధము అనగా జనన మరణాది దుఃఖములకు హేతుభూతమగు అవిద్య. అనిత్యమగుదానిని నిత్యమైనదిగను, అశుభ్రమగుదానిని శుభ్రమైనదిగను, దుఃఖమును సుఖముగను, అనాత్మను

ఆత్మగను భావింపజేయునది అవిద్య అని యోగసూత్రములు చెప్పు చున్నవి.

దేహేంద్రియాదులు అనిత్యములు. వానియందు నిత్యత్వమును గ్రహించుట అనిత్యములయందు నిత్యభావము.

మలమూత్రాదులతో నిండిన అపవిత్రమగు శరీరము పవిత్రమైనదని తలచుట అపవిత్రమునందు పవిత్రభావము.

దేహేంద్రియాదులు అనేకవిధములగు రోగములకు జన్మస్థానములు. అందుచే దుఃఖకరములు అయినను అవి సుఖము నిచ్చునుఅను తలంపు దుఃఖమునందు సుఖభావము. దేహేంద్రియాదులు అనాత్మ పదార్థములు అయినను 'నేనే అది' అను విపరీతభావము కలుగును. ఇదియే అనాత్మయందు ఆత్మభావము.

అవిద్యాపదముచే ఇవి అన్నియును గ్రహించవలెను.

శ్రవణ, మనన, నిదిధ్యాసములనుగురించి శ్రుతి చెప్పుచున్నది.

శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః।

"ఆత్మను శ్రవణము చేయవలెను, మననము చేయవలెను, నిదిధ్యాసనము చేయవలెను."

"తత్త్వమసి" అను మహావాక్యముద్వారా "తత్" పదముయొక్కయు "త్వం" పదముయొక్కయు అర్థమును శోధించుట ఎనిమిదవ సాధనము.

నిదిధ్యాసనముయొక్క పరిపక్వావస్థ సవికల్పసమాధి. సవికల్పసమాధియొక్క పరిపక్వావస్థ నిర్వికల్పసమాధి. నిర్వికల్పసమాధిద్వారా ఆవరణభంగము అగుటతో అపరోక్షజ్ఞానమగును.

"తత్త్వమసి" మహావాక్యముద్వారా "తత్" పదమయొక్కయు "త్వం" పదముయొక్కయు అర్థమును శోధించవలసిన అవసరమేమి అని ప్రశ్నించవచ్చును.

ఈశోధన అను ఎనిమిదవసాధనము శ్రవణమందే సమావేశ మగును అని సమాధానము.

తత్త్వజ్ఞానము కలిగిన తరువాత మనుష్యునకు ప్రపంచము మిథ్య అను నిశ్చయము కలుగును. ముత్యపుచిప్ప అని తెలిసినతరు వాత రజతము అనునది సత్యము అనుభావము బాధించబడినట్లు ఈ మిథ్యాత్వజ్ఞానము కలిగినతరువాత ప్రపంచమునందలి సత్యత్వభావము బాధించబడును. అట్లు బాధితమగు ప్రపంచమునందు మనస్సు ప్రవ ర్తించదు. ఈవిధముగ అంతర్బాహ్యప్రవృత్తులు లేనిమనస్సు కాష్ఠ రహితమగు అగ్నివలె తనమూలమునందు లయమును పొందును. శ్రుతికూడ చెప్పుచున్నది.

*యథా నిరిన్ధనో వహ్నిః స్వయోనావుపశామ్యతి।*
*తద్వద్వృత్తిక్షయాచ్చిత్తం స్వయోనావుపశామ్యతి॥*

"కట్టెలు లేని నిప్పు తన తేజస్సామాన్యమగు కారణమునందు లయ మగునట్లు అంతర్బాహ్యవిషయములకు సంబంధించిన వృత్తులన్నియు నశించుటచే చిత్తము తన అధిష్ఠానమగు కారణమునందు లయమును పొందును." దీనిపేరే మనోనాశము. మనోనాశము, తత్త్వజ్ఞానము రెండును కార్యకారణసంబంధము కలవి.

మనోనాశముః— సువర్ణాదులవలె సావయవమునై కామాదివృత్తులనెడు పరిణామమును కల అంతఃకరణమున మనన రూపమున ఉండుటచే మనస్సు అనబడును. ఈమనస్సు సత్త్వ, రజస్, తమోగుణముల కతమున క్రమముగా సుఖ, దుఃఖ, మోహ ములనబడు మూడుధర్మములను కలిగియుండును. ఈమూడు ధర్మము లును మనస్సును ఆశ్రయించుకొని ఉండుటచేతనే ప్రతీతములగును. అనగా మనస్సునందు సత్త్వాదిత్రిగుణములకును రూపము సిద్ధించును. మనస్సు రాజస తామస వృత్తులను పొందుటచే స్థూలమగును.

స్థూలమయిన మనస్సు ఆత్మసాక్షాత్కారమును పొందయోగ్యమైనది కాదు. ఏలనన ఆత్మ దుర్విజ్ఞేయము. అతి సూక్ష్మము. ఈ సూక్ష్మమగు ఆత్మను స్థూలమగు మనస్సు సాక్షాత్కరింప జేసికొనలేదు.

"దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః"

ఆత్మసాక్షాత్కారము అతిసూక్ష్మమగు బుద్ధికి కలుగునని శ్రుతి చెప్పుచున్నది. అందుచే ఆత్మసాక్షాత్కారమునకు సూక్ష్మమగు మనస్సు తప్పక అవసరము రాజస, తామస వృత్తులను నిరోధించుటచేతనే మనస్సు సూక్ష్మత్వమును పొందును. ఆ వృత్తులను నిరోధించి మనస్సును సూక్ష్మముగా చేయుటయే మనోనాశము.

మనోనాశమునుగురించి యోగావశిష్ఠమున వశిష్ఠులు ఇట్లు చెప్పుచున్నారు.

*ద్వౌ క్రమౌ చిత్తనాశస్య యోగో జ్ఞానం చ రాఘవ।*
*యోగస్తద్వృత్తిరోధో హి జ్ఞానం సమ్యగవేక్షణమ్॥*

"ఓ రాఘవ, బ్రహ్మసాక్షాత్కారమునకు ఉపయోగించునంత సూక్ష్మత్వమును పొందుట చిత్తనాశము. చిత్తనాశము రెండు విధములు కలుగును. 1. యోగము, 2. వివేకము. చిత్తవృత్తి నిరోధము యోగము. అన్నమయాది పంచకోశములనుండియు ప్రత్యగాత్మను విడదీసి చూచుట వివేకము.

చిత్తవృత్తినిరోధమునుగురించి శంకరాచార్యులు ఇట్లు చెప్పిరి:—

*యథా సువర్ణం పటుపాకశోధితం త్యక్త్వా మలం స్వాత్మగుణం సమృచ్ఛతి,*
*తథా మనః సత్త్వరజస్తమోమలం ధ్యానేన సంత్యజ్య సమేతి తత్త్వమ్॥*

"క్షారాదులచే బాగుగా శుద్ధిచేసిన సువర్ణము మురికిపోయి ఉజ్జ్వలత్వము అను తన గుణమును పొందునట్లు మనస్సు ధ్యానము ద్వారా సత్త్వ, రజ, స్తమోమలములు పోవుటచే బ్రహ్మతత్త్వమును పొందును."

వివేకజ్ఞానమునుగురించి తైత్తిరీయోపనిషత్తు చెప్పుచున్నది.

"స వా ఏష పురుషోఽన్నరసమయః"

"ఆ ఈ పురుషుడు అన్నరసమయుడు" అని ఆరంభించి,

"తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాదన్యోఽన్త రాత్మా ప్రాణమయః"

ఆకారణముచే ఆఅన్నరసమునకు అంతరాత్మ ప్రాణమయుడు అనియు,

"అన్యోఽన్తరాత్మా మనోమయః"

"అతనికికూడ అంతరాత్మ మనోమయుడు" అనియు,

"అన్యోఽన్తరాత్మా విజ్ఞానమయః"

"అతనికికూడ అంతరాత్మ విజ్ఞానమయుడు" అనియు,

"అన్యోఽన్తరాత్మాఽఽనన్దమయః"

"అతనికికూడ అంతరాత్మ ఆనందమయుడు" అనియు చెప్పుచున్నది. ఈవాక్యముల తాత్పర్యము అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములను ఆత్మగా నంగీకరించుమని కాదు. జిజ్ఞాసువునకు సోపానక్రమమున శుద్ధమగు ఆత్మను తెలుపుటయే.

ఈవిషయమున కఠోపనిషత్తునందు చెప్పబడినది.

ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః।
మనసస్తు పరా బుద్ధిః బుద్ధేరాత్మా మహాన్ పరః॥
మహతః పరమవ్యక్తమవ్యక్తాత్పురుషః పరః।
పురుషాన్న పరం కించిత్సా కాష్ఠా సా పరా గతిః॥

"ఇంద్రియములకంటె విషయములు సూక్ష్మములు. (ఏలనన ఇంద్రియముల ప్రవృత్తి విషయములకు లోబడి ఉన్నది) విషయములకంటె మనస్సు సూక్ష్మమయినది. మనస్సుకంటె బుద్ధి సూక్ష్మము. బుద్ధికంటె మహత్స్వరూపుడగు హిరణ్యగర్భుడు సూక్ష్మమైనవాడు.

హిరణ్యగర్భునికంటె అవ్యాకృతము సూక్ష్మమయినది. అవ్యాకృతము కంటె ఆత్మ సూక్ష్మమయినది. ఆత్మకంటె సూక్ష్మమయినది వేరొకటి లేదు. అదియే పరమాధారము. అదియే పరమగతి. దానినే పొందవలెను.''

ఈవిధముగా ఆత్మసాక్షాత్కారమునకు ధ్యానయోగము, వివేకము (సదసద్విచారము) ఈ రెండు సాధనములు అని తెలుచున్నది.

గీతయందుకూడ చెప్పబడినది.

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే।
ఏవం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి॥

“సాంఖ్యముచే తెలియనగుస్థానమే యోగముచేతనుకూడ తెలియనగును. సాంఖ్యము, యోగము రెండును ఒకటే అను విషయమును తెలిసికొన్నువాడు నిజమగు తత్త్వవేత్త.

సాంఖ్యమనగా సదసద్విచారము. సదసద్విచారమనగా ఆత్మవస్తు వివేచనచేయుట. ఆత్మవస్తువివేచనముచే లభించు స్థానమే యోగముద్వారా అనగా ధ్యానయోగముద్వారా కలుగు అపరోక్షజ్ఞానముచే లభించును.

**తత్త్వజ్ఞానము, మనోనాశము, వాసనాక్షయము-**
**ఈమూడును ఒకేసమయమున సిద్ధించును.**

“వాసనాక్షయము కానంతవరకు తత్త్వజ్ఞానము కలుగదు. తత్త్వజ్ఞానము కలుగనంతవరకు మనోనాశముకూడ అవదు. వాసనాక్షయము, తత్త్వజ్ఞానము, మనోనాశము– ఈమూడును కార్యకారణ సంబంధము కలవి. కావున ఈమూడింటిని ఒకేమారు అభ్యసించవలెను.'' అని వశిష్ఠులు చెప్పిరి.

వాసనాక్షయవిజ్ఞానమనోనాశా మహామతే।
సమకాలం చిరాభ్యస్తా భవన్తి ఫలదాయినః॥

"ఓ మహాబుద్ధిమంతుడగు రామా! వాసనాక్షయము, తత్త్వ జ్ఞానము, మనోనాశము- ఈమూడింటిని చాలకాలము ఒకేమారు అభ్యసించినచో జీవన్ముక్తావస్థ పొందబడును."

*తస్మాద్రాఘవ యత్నేన పౌరుషేణ వివేకినా।*
*భోగేచ్ఛాం దూరతస్త్యక్త్వా త్రయమేతత్సమాచరేత్॥*

"ఓ రాఘవ! పురుషార్థియగు వివేకి, విషయభోగాదులందలి కోరికను దూరమునుండియే విడనాడి తత్త్వజ్ఞానము, మనోనాశము, వాసనాక్షయము అను మూడింటిని అభ్యసించవలెను."

తత్త్వజ్ఞానమునకు శ్రవణము, మననము మొదలగునవి సాధనములు. మనోనాశమునకు యోగమును (సమాధిని) అభ్యసించుట సాధనము. మలినవాసనానివృత్తికి మైత్ర్యాదిప్రతికూలవాసనలను ఉద్భవింపజేయుట సాధనము.

వైద్యరాజ:—కొందరు విద్వాంసులు జ్ఞానులు రెండు రకములు అని చెప్పెదరు. 1. కృతోపాస్తి, 2. అకృతోపాస్తి. కృతోపాస్తికి తత్త్వజ్ఞానముతోపాటు జీవన్ముక్తికూడ కలుగును. అకృతోపాస్తి జ్ఞానము కలిగినతరువాత జీవన్ముక్తికొరకు వాసనాక్షయమును, మనోనాశమును అభ్యసించవలెను.

స్వా. ప్రి. :- ప్రతి అంతఃకరణమునందును మల, విక్షేప, ఆవరణములనెడు మూడు దోషములు ఉండును. అనేకజన్మలయందు బ్రహ్మహత్యాది పంచమహాపాపములను, గోహత్యాది పాపములను చేయుటవలన కలుగు మలినసంస్కారములు మలదోషము. విక్షేపదోష మనగా ఐదు రకములగు విషయాదుల భోగవాసనలు. ఆవరణదోషము అనగా జీవబ్రహ్మములమధ్య నుండు అజ్ఞానమను తెర. ఈమూడు దోషములను నివృత్తినొందించుటకు వేదశాస్త్రముల యందు క్రమముగా కర్మ, ఉపాసన, జ్ఞానము ప్రతిపాదింపబడినవి,

ఉపాసనచేసి విక్షేపదోషమును పోగొట్టుకొనకుండ తత్త్వజ్ఞానము కలుగునని ఎవరైన అనుకొనినచో అది సర్వదా అసంభవము. భోగవాసన రాగవిశేషము. ఉపాసన లేనిదే భోగవాసన నివృత్తిని పొందదు.

భోగవాసన నివృత్తిని పొందనిదే రాగాదిదోషములుకల అంతఃకరణమునందు జ్ఞానము ఎప్పుడును కలుగదు. "రజో రాగాదికం విద్ధి" అని భగవానుడు గీతలోకూడ చెప్పెను. "రాగాద మలినవాసనలు రజోగుణకార్యములు. వాసన రెండు రకములు. శుద్ధము, మలినము అని. శుద్ధవాసన దైవసంపద. మలినవాసన అసురసంపద. అసురసంపదను పోగొట్టుకొనుటకు దైవసంపదను సంపాదించవలెను. దైవసంపద అన్నివిధములుగాను లభించినపిమ్మట శ్రవణ, మనన, నిదిధ్యాసనములద్వారా జ్ఞానము కలుగును.

రాగాది అసురగుణములు రజోగుణకార్యములు. వైరాగ్యాదులు మిశ్రసత్త్వముయొక్క కార్యములు. తత్త్వజ్ఞానము శుద్ధసత్త్వముయొక్క కార్యము. "సత్త్వాత్ సంజాయతే జ్ఞానం" అని భగవానుడు గీతయందు చెప్పెను.

మిశ్రసత్త్వగుణమునకు చెందిన దైవసంపదయందు రజోగుణము ఉండదు. ఆ దైవసంపదచే శుద్ధసత్త్వగుణముకల జ్ఞానియందు మరల రాగము జనించును అను అభిప్రాయము తప్పు. కొందరు విద్వాంసులు అంతఃకరణమునుండి భోగవాసనను నివృత్తిని పొందించలేక, కేవలము శాస్త్రాభ్యాసము మాత్రమే చేసినందున "మేము తత్త్వజ్ఞానులము, మాకు విదేహముక్తియందు ఎట్టిబాధయు ఉండదు, జీవన్ముక్తి ఆనందమునకు బాధాకరము" అని చెప్పి జీవన్ముక్తికిని తత్త్వజ్ఞానమునకును భేదమును ప్రతిపాదించెదరు. వారు భోగవిలాసములయందు నిమగ్నులగుదురు. తాము కృతకృత్యుల మనుకొనెదరు.

వైద్యరాజ:—జీవన్ముక్తియందు విద్యారణ్యులు చెప్పిరి.

*రాగాదయః సన్తు కామం న తద్భావోపరాధ్యతి।*
*ఉత్ఖాతదంష్ట్రోరగవదవిద్యా కిం కరిష్యతి॥*

"జ్ఞానికి రాగాదులు కలుగవు. కలిగినను వానివలన ఏమియు బాధ కలుగదు. విషపుకోరలు తీసివేసిన సర్పము ఏమియు బాధించ లేనట్లుగనే జ్ఞానికి రాగాది అవిద్యాకార్యములు ఏమియు చేయలేవు."

స్వా. ప్రి. :—జీవబ్రహ్మములమధ్యనున్న అజ్ఞానము తత్త్వజ్ఞానముచే నివృత్తిని పొందినపిమ్మట అజ్ఞానము, అజ్ఞానకార్యములును అగు రాగాది మలినవాసనలకు అస్తిత్వము కలదనుట సరియేనా?

వైద్యరాజ :—తత్త్వజ్ఞానము కలిగినతరువాత రాగాదులగు మలినవాసనలు ఉండవు. కాని విద్యారణ్యస్వామివంటి మహావిద్వాంసులు అసత్యము వ్రాయుదురా?

స్వా. ప్రి. :—(నవ్వుచు) బికనీరులో ఒక మార్వాడీ ఉండెను. అతడు 12, 13 సంవత్సరముల బాలికను పెండ్లాడెను. అనంతరము తన వ్యాపారమునకు పరదేశమునకు వెళ్ళిపోయెను. మూడు, నాలుగు సంవత్సరములతరువాత మామగారు అతనికి ఉత్తరము వ్రాసెను. "మా అమ్మాయి పెద్దమనిషి అయినది. నీవు వచ్చి తీసికొని వెళ్ళుము." ఆరుమాసముల తరువాత వచ్చెదనని మార్వాడీ సమాధానము వ్రాసెను. కాని ఆరుమాసములతరువాత అతడు వెళ్ళలేదు. అంతట మామగారు అతనికి తరుచు ఉత్తరములు వ్రాయుచుండెను. కాని అతడు నాలుగు మాసములలో వచ్చెదను, ఐదుమాసములలో వచ్చెదను అని సమాధానములు వ్రాసెను కాని వెళ్ళలేదు. ఇట్లు పెండ్లి అయినతరువాత 12, 13 సంవత్సరములు గడచిపోయెను. అప్పటికి ఆమార్వాడీ బొంబాయివచ్చి, అచ్చటి మార్వాడిబజారులో మకాము చేసియుండెను. మార్వాడిమామగారు చాల విసుగెత్తియుం

డెను. కావున ఆతడు తన అల్లుని స్నేహితునితో, "నేను ఉత్తరములు వ్రాసివ్రాసి విసిగితిని. నీవే వ్రాయుము" అని చెప్పెను. ఆ ఇరువురును కూర్చొని ఉత్తరము వ్రాసిరి. వ్రాయుచుండగా ఆతనికి కోపము వచ్చి ఇట్లు వ్రాయమనెను. "ఇంకా ఎక్కువ ఏమి వ్రాయుదును. నీ భార్య విధవ అయిపోయినది. ఇప్పుడైన రమ్ము." మిత్రుడు వ్రాయుటకు జంకెను. అంతట మామగారు ఇట్లనెను. "నీకేమి భయము లేదు. నేను ఉన్నాను. వ్రాయుము." ఆవిధముగా బొంబాయికి ఉత్తరము వ్రాయగా అందెను.

నలుగురులోను ఆఉత్తరము చదివి మార్వాడీ మొత్తుకొని ఏడ్వసాగెను. నాలుగువైపులనుండి జనులు ప్రోగుపడి ఎవరు చనిపోయిరి? అని ప్రశ్నించిరి. మార్వాడీ ఏడ్చుచు "నాభార్య విధవ అయిపోయినది" అని పలికెను అందరు పకపక నవ్విరి.

మార్వాడీ పలికెను. నేనేమైనా అబద్ధము చెప్పుచున్నానా! ఉత్తరము చదివి చూడండి. జనులు ఉత్తరము చదివిరి. అనంతరము వారు ఇట్లనిరి. ఉత్తరమునందు వ్రాయబడియున్నను, నీవు ఇక్కడ కూర్చొనియుండగా నీభార్య విధవఅగుట ఎట్లు? ఆమాత్రం ఆలోచించవేమి?

మారువాడీ:- అది నేనుకూడ ఎరుగుదును. కాని స్నేహితుడు ఇట్లు ఎందుకు వ్రాయును? అసత్యము వ్రాయడుకదా! అని అడిగెను.

మీరుకూడ ఆమార్వాడీవలె యుక్తిరహితంగా మాట్లాడుచున్నారు.

ఇది విని శ్రీనిత్యానందస్వామివారు మొదలగువారందరును నవ్వసాగిరి.

యోగవాసిష్ఠము చెప్పుచున్నది.

యుక్తియుక్తముపాదేయం వచనం బాలకాదపి,
అన్యత్ తృణమివ త్యాజ్యమప్యుక్తం పద్మయోనినా॥

"ఆధారముకల వాక్యము బాలకుడు చెప్పినను గ్రహించవలెను. నిరాధారమగునది బ్రహ్మ చెప్పినను గడ్డిపోచతో సమానముగా చూచి త్యజించవలెను."

ఇదంతయును నేను వినోదార్థము చెప్పితిని. జీవన్ముక్తికి సంబంధించిన ఆశ్లోకమునందలి రాగశబ్దమునకు భావము రాగము కాదు, రాగాభాసము మాత్రమే.

దప్పిక గొన్నవాడు ఎండమావులను చూచి నీరని భ్రమపడి దాహము తీర్చుకొనుటకు వానివైపు పరుగిడును. కాని ఆతనికి అచ్చట నీరుకన్పించక ఎండమావులే కన్పించును. అంతట వానికి ఎక్కడ ఊరభూమి ఉన్నను అది ఎండమావులే అయి ఉండును: నీరు అనుకొనుట అజ్ఞానము అని తోచును. అటులనే జ్ఞానముద్వారా విషయాదులయందు మిథ్యాత్వబుద్ధి కలిగినంతనే పదార్థములయందు రాగాది మలినవాసనలు కలుగుటకు అవకాశము పోవును. కావున పైశ్లోకమునందలి రాగశబ్దమునకు తాత్పర్యము రాగాభాసము మాత్రమే. జ్ఞానికి ఉండు అన్నపానాదులను పొందవలెనను కోరిక రాగాభాసము అనబడును.

వైద్యరాజ :—తత్త్వజ్ఞానము కలిగినపిమ్మట భోగవాసన ఉండదు. అది బాగుగనే ఉన్నది. కాని సమాధినుండి ఉత్థానమును పొందినపిమ్మట జ్ఞానియొక్క వృత్తి బహిర్ముఖమగును. కర్తృత్వ, భోక్తృత్వాది అంతఃకరణధర్మమును క్లేశమును కలుగ జేయును. ఆతడు దుఃఖనివృత్తిని పొందుటకును, మరల జీవన్ముక్తియొక్క ఆనందమును పొందుటకును సమాధిని అభ్యసించవలెనా?

స్వా. ప్ర. :—ఒకమారు సమాధిద్వారా అవిద్య, అవిద్యాజన్యములగు దుఃఖములు నశించి బ్రహ్మసుఖము పొందినతరువాత మరల దుఃఖనివృత్తికొరకు సమాధిని అభ్యసించుట అసంభవము. ఎట్లనిన :—

ఒకమారు ఒకబ్రాహ్మణుడు స్నానముచేయుటకు సరోవరమునకు వెళ్ళెను. స్నానముచేసి వచ్చుచు తన ధోవతిని ఉతికికొని, పిండి, భుజముపై వేసికొనెను. ఇంటికి వచ్చినతరువాత ఆధోవతిని ఆరబెట్టుటకు విదల్చెను. దానిలోపలనుండి ఒక చిన్నచేపపిల్ల బయట పడి గిలగిల కొట్టుకొనసాగెను. బ్రాహ్మణుడు దయకలిగి ఒక కుండలో నీరుపోసి దానిలో ఈచేపపిల్లను వెసి చెరువువద్దకు తీసికొనివెళ్లి కుండను అందులో విడచెను. చేపపిల్ల ఎంతయో ఆనందించెను. కుండనుండి చెరువులోనికి వెళ్ళుచు, మరల చెరువునుండి కుండలోనికి వచ్చుచు చేపపిల్ల ఎంతయో ఆనందమును పొందుచుండెను. రెండు చోట్లను నీరు ఉండుటయే ఇందుకు కారణము.

ఈవిధముగనే ఒకమారు జీవునకును, బ్రహ్మమునకును మధ్యకల తెర పడిపోయినచో సమాధిదశయందు ఉన్నను, ఉత్థానదశయందున్నను ఆనందము సమానముగానే కలుగును. ఇక దుఃఖమునకు అవకాశమేది?

ఈవిషయమున శంకరభగవత్పాదుల వాక్యములను వినుడు.

*దేహాభిమానే గలితే విజ్ఞాతే పరమాత్మని।*
*యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర సమాధయః॥*

"దేహాభిమానము నశించి, పరమాత్మజ్ఞానము కలిగిన తరువాత మనస్సు వెళ్లిన ప్రతిచోటకును సమాధికూడ వెళ్ళును."

స్వా. ని. :—తత్త్వజ్ఞానము కలిగినపిమ్మట రాగము మొదలగు మలినవాసనలు ఉండవు. దరిద్రుడెవడైన చక్రవర్తి అయినచో ఆతనికి దారిద్ర్యమువలన కలిగిన దుఃఖములు పోవును. కాని వ్యాధిజన్యములగు దుఃఖములు నివృత్తిని పొందవు. అటులనే జ్ఞానికి అవిద్యాజన్యములగు దుఃఖములు నివృత్తిని పొందినపిమ్మట బ్రహ్మానందసామ్రాజ్యము లభించును. కాని ప్రారబ్ధకర్మములవలన శరీరమునందు

రోగాదిజన్యములగు దుఃఖములు మాత్రము కన్పట్టుచున్నవి. అవియును తత్త్వజ్ఞానికి బాధితానువృత్తిరూపమున ప్రతీతమగుచున్నవి. అందును భేదము కలదు. నిర్వికల్పసమాధి రెండురకములు. 1. అద్వైతభావన, 2. అద్వైతఅవస్థ.

అద్వైతభావమును పొందినవానికి ఆవరణభంగము అయిన పిమ్మట వృత్తి భావరూపమును పొందుటచే దుఃఖములు బాధితానువృత్తిరూపమున ప్రతీతము లగును. అశుద్ధసత్త్వగుణప్రధానమగు బ్రహ్మాకారవృత్తికూడ స్వరూపమునందు లయమును పొందును. అది అద్వైతావస్థ అనబడు నిర్వికల్పము. అదియే గుణాతీతావస్థ అని కూడ చెప్పబడును. ఇట్టి గుణాతీతునకు దుఃఖములుకూడ బాధితానువృత్తిరూపమున ప్రతీతములు కావు. ఇది ఛాందోగ్యోపనిషత్తునందు చెప్పబడినది.

*న పశ్యో మృత్యుం పశ్యతి న రోగం నోత దుఃఖతామ్।*
*సర్వం హ పశ్యః పశ్యతి సర్వమాప్నోతి సర్వశః॥*

"బ్రహ్మవేత్త మృత్యువును చూడడు. రోగమును చూడడు. శీతోష్ణాది సుఖదుఃఖములను చూడడు. బ్రహ్మవేత్త అన్నిటిని స్వస్వరూపములుగనే చూచును. అన్నివిధములుగను అన్నిటియందును సర్వాత్మకమగు బ్రహ్మస్వరూపమును పొందును."

వైద్యరా :—అద్వైతభావన అను నిర్వికల్ప సమాధినుండి అద్వైతఅవస్థ అనబడు నిర్వికల్పసమాధిలోనికి వెళ్లుటకు సాధనమేమి?

స్వా॥ ని॥ :—తత్త్వజ్ఞానము కలిగినపిమ్మట జనుల సంసర్గము లోనుండి ఉపదేశాది సాత్త్వికప్రవృత్తులను కలిగియుండు జ్ఞానులు అద్వైతభావమున ఉందురు. ఈ అద్వైతభావమునందుకూడ భేదములు కలవు.

జ్ఞానభూమికలు ఏడు :— (1) శుభేచ్ఛ, (2) విచారణ, (3) తనుమానస, (4) సత్త్వాపత్తి, (5) అసంసక్తి, (6) పదార్థ భావిని, (7) తురీయ.

వీనిలో మొదటిమూడును సాధనకోటికి సంబంధించినవి. మిగిలిన నాలుగును జ్ఞానకోటికి చెందినవి సత్త్వాపత్తి, అసంసక్తి, పదార్థ భావిని, తురీయ— అను ఈ శ్రేణికి చెందినవారు క్రమముగ బ్రహ్మవిదుడు, బ్రహ్మవిద్వరుడు, బ్రహ్మవిద్వరీయసుడు, బ్రహ్మవిద్వరిష్ఠుడు అనబడుదురు. వశిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు మొదలగు నాలుగవ భూమికయందు ఉన్నవారు బ్రహ్మవిదులని చెప్పబడెడివారు. జనులకు ఉపదేశించుట మొదలగు సాత్త్వికప్రవృత్తులనుకూడ కలిగియుండెడివారు. శుకుడు మొదలగు ఐదవ భూమికయందలివారు బ్రహ్మవిద్వరు లనబడెడివారు.

ఇట్టివారు ఈజగమున నిర్ద్వంద్వులుగా తిరిగెడివారు. ఇట్టివారలనుగురించి శంకరులు చెప్పిరి.

*దిగమ్బరో వాఽపి చ సామ్బరో వా త్వగమ్బరో వాఽపి చిదమ్బరస్థః।*
*ఉన్మత్తవద్వాఽపి చ బాలవద్వా పిశాచవద్వాఽపి చరత్యవన్యామ్॥*

"చైతన్యాకాశమున నున్న బ్రహ్మజ్ఞుడు వస్త్రము లేకుండగనో, లేక వస్త్రముతోనో, లేక చెట్లఆకులు మొదలగునవి ధరించియో, లేక వెర్రివానివలెనో, లేక బాలునివలెనో, లేక పిశాచమువలెనో ఈ భూమిపై సంచరించును."

నేను పూర్వాశ్రమమున బెల్గాములోనున్నపుడు హనుమానుగనీలో బ్రహ్మనిష్ఠుడగు మహాత్ముడు ఒకడు ఉండెనని విని ఆయన దర్శనమునకు వెళ్ళితిని. ఆతని కేశములు చిందరవందరగా నుండెను. గడ్డము మొదలగువానితో చూచినవారికి మహాభయంకరముగా నుండెను. అక్కడ ఒక బ్రాహ్మణ అగ్రహారము కలదు. ఆ అగ్రహారను

మధ్యనే హనుమానునిమందిరము ఉండెను. ఆమహాత్ముని చూచుటకు నేను వెళ్ళుసరికి ఆయన బ్రాహ్మణులు భోజనముచేసి పార వేసిన ఆకులను ఏరుకొని చంకలో నిడుకొని తిరుగుచుండెను. "ఈవిధముగానుండు మనుష్యుడు మహాత్ముడు ఎట్లగును?" అని నాకు తోచెను. ఈసందేహము నాకు కలుగు సమయమున అక్కడకు ఒక బ్రాహ్మణుడు ఆయనకు సేవచేయుటకు వచ్చుచుండెను. బాలచాపల్యముతో నేను అతనిని అడిగితిని. "ఈ మహాత్ముని నీవు ఇంత ఎక్కువగా సేవించుచున్నావు. ఈయనయందు ఎంతయో పూజ్యభావమును కలిగియున్నావు. నీకేమైన లాభము కలిగినదా?" అంతట ఆతడు ఇట్లు చెప్పెను. "నేను చెప్పినచో అహంకారము అనుకొనెదరు. లేనిచో అసత్యము పలుకవలసి వచ్చును. ఏమి చెప్పను!" ఆమహాత్ముడు పిచ్చివాడు కాడనుభావము నాకు కలిగెను. అయినను నాకు సందేహము పోలేదు. బెల్గామునుండి 17, 18 మైళ్ళుదూరమున ఒక అమ్మవారిగుడి యుండెను. ఆవిడ మాహాత్మ్యము చాలగొప్పదని అందరు చెప్పెడివారు. ఏదైన రోగము వచ్చినచో ఎట్లు తగ్గును? తగ్గునా, తగ్గదా అనునది ఆవిడ చెప్పెడిదట. అందరును ఆమెను అడుగుటకు వెళ్లెడివారు. ఆగ్రామమున ఒక వ్యాపారి ఉండెను. అతనికి కడుపులో పోటు వచ్చి దానిచే ఆతడు చాలాబాధ పడుచుండెను. ఎన్నిమందులు వేసినను బాధ తగ్గలేదు. ఆతడు కూడ అమ్మవారివద్దకు అడుగుటకు వచ్చెను. ధూపముతో అమ్మవారు పూని చెప్పెను. మాగ్రామమునందలి హనుమాన్‌గలీలో ఒక మహాత్ముడు కలడు. ఆయనకు మూడుపూటలు భోజనము పంపినచో ఈబాధ తగ్గిపోవును. అటుతరువాత ఆవ్యాపారి అటులనే చేసెను. ఆతనిబాధలు పోయెను. అప్పటినుండి ఆతడు ప్రతిరోజు ఆయనకు భోజనము పంపెడివాడు. ఇది చూచినతరువాత ఆమహాత్ముడు పిచ్చివాడు కాడు, జ్ఞాని అను నమ్మకము కలిగెను. పంచమభూమికస్థుం

దున్నవారు ఇట్లు పిచ్చివానివలెను, బాలునివలెను ఉందురు. వీరివృత్తి అంతర్ముఖమయినకొలదియు దేహాభానము తగ్గుచుండును.

ఆరవభూమికయందు నడచుట, నమలుట, చూచుట మొదలగు క్రియలు ఆగిపోవును. చూచుట ఆగిపోవును అనగా కన్ను మూతపడదు. కాని శవమువలె చపలత్వరహితముగ నుండును, 1954 విక్రమశకమున (1897 క్రీ॥ శ॥) కుంభకోణమునందు ఒకమహాత్ముని ఈస్థితిలో చూచితిని. ఆగ్రామస్థులు 38 సంవత్సరములనుండి ఆయన ఆస్థితిలో ఉన్నాడని చెప్పిరి. తరువాత 5 సంవత్సరములు జీవించెను.

7 వ భూమికయందున్నవాడు బ్రహ్మవిద్వరిష్ఠుడు. ఏడవ భూమికయందు శరీరము 21 రోజులు ఉండును అని చెప్పుదురు. తత్త్వజ్ఞానముతోబాటు జీవన్ముక్తి కలుగును. ఈరెంటియందును భేదము లేదు.

వైద్యరాజ :— కొందరు విద్వాంసులు తత్త్వజ్ఞానము కలిగిన తరువాత అవిద్యాలేశము ఉండును అని చెప్పుదురు. దాని నివృత్తికొరకు మరల యోగమును చేయవలెనా?

స్వా. ని. :—అవిద్యయందు రెండు అంశములు కలవు. 1. ఆవరణము. 2. విక్షేపము. ఆవరణాంశము తత్త్వజ్ఞానముతో బాటు నశించును. విక్షేపాంశము ప్రారబ్ధకర్మక్షయమువరకును ఉండును.

తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యేఽథ సంపత్స్యే।

ప్రారబ్ధకర్మక్షయము అగునంతవరకుమాత్రమె ఆతనికి ఆత్మప్రాప్తి కలుగుటకు ఆలస్యమగును. ప్రారబ్ధకర్మము నశించి శరీరపాతము అయినంతనే అతనికి సద్వస్తువు లభించును.

కాని అజ్ఞానులు ముక్తిని పొందువరకు ఎదురుచూచుచుందురు. అనగా ప్రారబ్ధక్షయమును ఎదురుచూచుచుందురు. ప్రారబ్ధక్షయము

అగుటచే పరబ్రహ్మమునందు లీనమగుదురు. కాని తత్త్వజ్ఞానము కలిగినతరువాత యోగాభ్యాసముచేయుట అనగా కుమారుడు పుట్టిన తరువాత పెండ్లిచేసికొనుటవంటిది.

స్వా. ప్ర. :—ఒకమారు నేను "వాంసదా" వెళ్ళితిని. సంభాషణలో వింటిని. అచ్చటి భిల్లులు కార్యముచేసికొని ఇద్దరు ముగ్గురు పిల్లలు పుట్టినతరువాత పెండ్లి చేసికొనెదరట. తల్లిదండ్రులు పెండ్లిసమయమున పిల్లలఎదుట ఒట్టుపెట్టుకొనెదరు. ఇది ఏమిటి అని ప్రశ్నించగా ఇట్లు సమాధానము వచ్చెను. "ఇది అడవిజాతి. మాటిమాటికి కల్లు త్రాగి కొట్టుకొని విడాకులు పుచ్చుకొనెదరు. కాని పిల్లలు పుట్టినచో వారియందలి ప్రేమచే అట్లు చేయలేరు. అందుచేతనే అట్లు పెండ్లాడెదరు. ఇది భిల్లమతము."

ఇది విని అందరు నవ్విరి.

వైద్యరాజ :—ఇక్కడికే ఒకస్వామి వచ్చిరి. వారు విద్వాంసులు. మనస్వామివారితో వారుకూడ చర్చించుచుండిరి. "తత్త్వజ్ఞానము కలిగినతరువాతకూడ ప్రారబ్ధానుసారము భోగేచ్ఛయుండును అని వారివాదము. శ్రీనిత్యానందస్వామివారు "భోగేచ్ఛ అసురగుణము. జ్ఞానికి ఎట్లు కలుగును?" అని ప్రశ్నించిరి. ఆస్వామి తనవాదమును మొండిగా నిలబెట్టుకొనసాగెను. అంతట స్వామివారు మౌనము గ్రహించిరి.

స్వా. ప్ర. :—నాప్తోపదేశం సంవేత్తి విద్యామత్తః స్వహేతుభిః ।
అనర్థమప్యభిప్రేతం మన్యతే పరమార్థవత్ ॥
(శుక్రనీతి)

"విద్యామదముకలవాడు ఆప్తవాక్యమును తనకు కష్టము కలుగునను భావముతో అంగీకరించడు. తనకు అనుకూలముగా నున్నచో అనర్థకరమగు అభిప్రాయమునుకూడ పరమార్థమువలె భావించి అంగీకరించును."

నేటి విద్వాంసులకు శాస్త్రములయందు శ్రద్ధలేదు. వారు విషయానులయందు ప్రవర్తించు చిత్తవృత్తులను ఆపుకొనలేరు. ఆ కారణముచే తమ మర్నతిని అనుసరించియే శాస్త్రార్థమును చెప్పెదరు. అంతేకాదు. శ్రుతి, స్మృతుల టీకలుకూడ తమకు అనుకూలమగునట్లుగనే చెప్పుదురు. అందుచేతనే మహాత్ములు చెప్పిరి.

*భక్త్యా భాగవతం శాస్త్రం న వ్యుత్పత్త్యా న టీకయా ।*
*గృహిణ్యైవ గృహం ప్రోక్తం న పుంశ్చల్యా న వేశ్యయా ॥*

"భగవత్ప్రతిపాదితమగు శాస్త్రార్థము భక్తిచేతనే నిర్ణయించబడును వ్యుత్పత్తులు చెప్పికాని, టీకలు వ్రాసికాని నిర్ణయించబడదు. గృహిణి ఉన్నది గృహము. అంతేకాని పురుషులను చూచినంతనే ఉద్రేకమును చెందు కులటకాని, వేశ్యకాని ఉన్నగృహము గృహము కాదు."

అనగా శాస్త్రాభ్యాసము చేసినను శ్రద్ధాభక్తులతో ప్రభుపరాయణులు కానంతవరకు నిజమగు బోధ కలుగదు. శ్రద్ధాభక్తులతో ప్రభుపరాయణులగువారిని గురించి భగవానుడు గీతలో చెప్పెను.

*తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ,*
*దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే ॥*

"పరమేశ్వరునియందు ఏకాగ్రబుద్ధి కలిగి, ప్రేమతో పరమేశ్వరుని భజించు భక్తులకు బుద్ధియోగము లభించును. ఆబుద్ధియోగముచే వారు తమ ఆత్మరూపమును పొందుదురు. ఆ బుద్ధియోగమును నేను వారికి కలుగజేయుదును."

## భర్తృహరి మహారాజుగారి ఆదర్శత్యాగము.
## పింగళామహాదేవి ఆదర్శపాతివ్రత్యము.

తరువాతిరోజున శ్రీప్రకాశానందస్వామివారు రాజకోట వెళ్ళవలసియుండెను. అది తెలిసికొని మూల్వాలా రాజుగారు స్వామి

వారి దర్శనమునకు వచ్చిరి. వారితో శ్రీశంకరానందస్వామివారును, వైద్యరాజ గోపాలజీభాయియునుకూడ వచ్చిరి. వారు భిక్షచేసి సాయంకాలము వెళ్లుడని పట్టుపట్టిరి. కాని స్వామివారు ఒప్పుకొనలేదు.

**మూల్వాలా** :—తమవంటి త్యాగులపాదరజో భాగ్యము మా యింటికి కలుగవలెనుగదా !

స్వా. ప్రి. :—నేనేమి త్యాగిని? పూర్వం పిండి అడిగేవాడిని. ఇప్పుడు రొట్టె అడుగుచున్నాను. భర్తృహరి మహారాజు త్యాగి. ఆయన మాలవరాజ్యసంపదనంతను త్యజించి వెళ్లిపోయెను.

**మూల్వాలా** :—పింగళ దుష్టురాలు కావున వెళ్ళిపోయెను. ఆయనకు వైరాగ్య మెక్కడ?

స్వా. ప్రి:—పింగళ చెడ్డది అనుసంగతి నాటికాలపువాళ్ళు కల్పించిన అభూతకల్పన. పింగళ అసలుపేరు భానుమతి. భర్తృహరి నిర్వేదమునందు ఉన్నది. ఒకనూరు భర్తృహరిమహారాజు, మహారాణి భానుమతి ఇరువురును మూడవఅంతసులోని 'ఝరోఖా'లో కూర్చొని యుండిరి. ఆసమయమున మూరమునుండి మేళతాళము లతో ఒక ఊరేగింపు వెళ్ళుచుండెను. మహారాజు ఒక నౌకరును క్రిందనుండి వెళ్లి ఊరేగింపు ఏమిటో తెలిసికొని రమ్మని పంపెను. నౌకరు వెళ్లి తెలిసికొనివచ్చి చెప్పెను. ఒకామె భర్త చనిపోయెను. ఆమె భర్తతో సహగమనము చేయుటకు వెళ్ళుచున్నది. ఈఊరేగింపు అదియే. మహారాజు హర్షోద్రేకములో ఇట్లనెను:— "ఆహా! మా రాజ్యములో ఇటువంటి పతివ్రతలు ఉన్నారా!" ఇది విని మహారాణి భానుమతి పలికెను. "ఈమె పతివ్రత కాదు. ఈమె సాహసముకల వనితమాత్రమే."

భర్తృ:—పతివ్రతకును సాహసనారికిని కల భేదమేమి?

భానుమతి:—తన భర్తమృత్యువును గురించినవార్త తెలియు గనే తన ప్రాణమును విడచు వనిత పతివ్రత. భర్త్రమరణానంత రము యోధుడు దృఢమనస్సుతో యుద్ధభూమికరిగి ప్రాణములర్పించి నట్లు భర్తృశవమునకు అగ్నిసంస్కారముచేసి దృఢమగు మనస్సుతో అగ్నియందు ప్రవేశించునది సాహసవనిత.

ఇది విని భర్తృహరి మహారాజు ఏమియు పలుకలేదు. కాని మనస్సులో ఈమెను పరీక్షించవలె ననుకొనెను. నాలుగైదు మాస ములు గడచినతరువాత భానుమతిని పిలచి నేను వేటకు వెళ్ళుచున్నా నని చెప్పెను. ఇట్లని రాజధానినుండి 25, 30 క్రోసులు వెళ్లి పోయెను. అచ్చటినుండి ఇద్దరు మనుష్యులను రాజధానికి వెళ్లి తాను చనిపోయినసంగతి రాణికి తెలుపమని పంపెను. వారు మహారాణి వద్దకువెళ్లి మిక్కిలి ఖేదముతో కండ్ల నీరు కార్చుచు నిలబడిరి. మహా రాణి ప్రశ్నించెను. "అంత దుఃఖకరమగు సంగతి ఏమి చెప్పదలచి యున్నారు? అసలుసంగతి ఏమి?" అతడు చెప్పెను. "ఏమి చెప్పను తల్లిగారూ! నోటినుండి మాట వచ్చుటలేదు."

మహారాణి మరల ప్రశ్నించెను:— "ఏమి జరిగినది?"

మనుష్యుడు:—మహారాజుగారు పులిపై తుపాకిని కాల్చిరి. తుపాకి సరిగా పేలలేదు. ఇంతలో పులివచ్చి మహారాజుగారిని చంపి వేసినది. ఇది విని మహారాణి "హా! మహారాజా చనిపోయినారా!" అని నిట్టూర్పు విడిచి ప్రాణములను త్యజించెను.

మహారాజు కుటుంబములోనివారు వచ్చి మహారాణికి అగ్ని సంస్కారముచేసిరి. మహారాజు వేటనుండి తిరిగివచ్చుచు కోటపై నల్లజండానుచూచి ప్రశ్నించెను. "రాజకుటుంబమున ఎవరు చని పోయిరి?" అచ్చటివారు చెప్పిరి:—"తమరు పరీక్షించుటవలన ఈఫలి తము కలిగినది." ఇట్లని జరిగిన సంగతి అంతయు నివేదించెను.

ఇదివిని మహారాజు భవనములోనికి వెళ్ళుట మానివేసెను. అచ్చటనుండియే శ్మశానమునకు వెళ్ళిపోయెను. ఆమె చితాభస్మము నందు దొర్లుచు "ఓ భానుమతీ! నీవు పతివ్రతవు. నీవు నిజము చెప్పితివి. నీవు సచ్చరిత్రవు. నీవు నాఆజ్ఞానుసారము సంచరించెడిదానవు." అని అనేకవిధములుగా ఆమెగుణములు వర్ణించుచు ఏడ్చుచుండెను. ఆహారమును విసర్జించెను. ఈవిధముగా ఐదు, ఆరురోజులు జరిగెను. ఇంక మహారాజు ఇట్లు ఏడ్చుచు చనిపోయెద రనుకొనిరి. ఏదైన ఉపాయమును ఆలోచించవలెనను తలంపుతో మహారాజు గురువుగారగు గోరఖనాథునివద్దకు వెళ్ళి నివేదించిరి.

గోరఖనాథుడు మారువేషముతో చేతిలోకుండ తీసికొని శ్మశానమునకు వెళ్ళెను. మహారాజు చూచుచుండగ ఆకుండ చేతినుండి జారి పడి పగిలిపోయెను. గోరఖనాథుడు అక్కడనే కూర్చొని ఏడ్వసాగెను. "ఓ నాకుండా! నీవు ఏల పగిలిపోతివి?" భర్తృహరి ఇట్లనుకొనెను. ఇతడెవరు? "నాకంటెను ఎక్కువగా దుఃఖించుచున్నాడే!" అటుపిమ్మట ఆయన యోగితో ఇట్లనెను. "నీవు ఈకుండకొరకు ఇంత ఎక్కువగా ఏల దుఃఖించుచున్నావు?" ఇదిగో నా బంగారు చెంబును ఇచ్చుచున్నాను, తీసికొనుము" అనెను. యోగి పలికెను. బంగారు చెంబు నాకు ఎందుకు ఉపయోగపడును? నాకుండ ఎంతమంచిదో నీకు తెలియునా? వినుము.

*కరీషానుచ్ఛేతుం దహనముపనేతుం ముహురపః*
*సమాహర్తుం భిక్షామటితుమథ తాం రక్షితుమపి।*
*విధాతుం పక్తుం చాళితుమపి చ పాతుం పునరథో*
*వధాతుం నః పాత్రీ చిరమహహ చిన్తామణిరభూత్॥*

"అరణ్యమునుండి ఎండుపిడుకలను తెచ్చుటకును, నిప్పును తెచ్చుటకును, నీళ్ళు తెచ్చుటకొనుటకును, భిక్షను అడిగికొనుటకును, అడిగి

కొని తెచ్చిన భిక్షను దాచికొనుటకును, ఒక్కొక్కప్పుడు వండుకొనుటకును, భుజించుటకును, నీరు త్రాగుటకును ఉపయోగపడుచుండెడిది. అయ్యో! ఏమని వర్ణించెదను. నిద్రించునప్పుడు తలగడవలెకూడ ఉపయోగించుచుండెడిది. నాకుండ నాకు చింతామణివలె సర్వవిధములను ఉపకరించుచుండెను."

ఇదియే నాసర్వస్వమును. హా! హతవిధీ! ఈకుండముక్కల నన్నిటిని ప్రోగుచేసి వీనితో నేను సహగమనము చేయుదును. ఈ కుండ ఎంత బలమైనదో చూచుటకు నేను నేలను పెట్టి కొట్టితిని. అందుచేత పగిలిపోయినది. ఆకారణముచే ఈకుండ నశించుటకు హేతువును నేనే. ఇక అదిలేనిదే నేను జీవించుట ఎట్లు?

భర్తృహరి :—"నాభానుమతి ఎట్లు సహగమనము చేసినదో తెలుపుటకు కపటముగా ఈగ్రంథమంతయు సృష్టించి నామోహాంధకారమును పోగొట్టిన ఈవ్యక్తి నా గురుదేవులే అయిఉండవచ్చును." ఇట్లు తలచి గురుదేవుని పాదములపై బడి ఇట్లనెను. "ఓ గురుదేవా! అనుగ్రహించి మోహముతో కూడిన ఘోరమగునిద్రనుండి మేల్కొలిపిరి. నాకు ఉపదేశమును అనుగ్రహించి కృతార్థుని చేయుదు."

## సంసృతి అను ప్రపంచజాలము సంకల్పముచే జనించినది.

గోరఖనాథుడు :—

*సంకల్పాత్ సకలాపి సంసృతిరభూదేషా విశేషాద్వ్యభూ*
*రస్యాశ్చేద్ వినివృత్తిమిచ్ఛసి తదైత న్మూలమున్మూలయ।*
*నావచ్ఛిన్నమనేహసా న చ దిశా యద్ బ్రహ్మ సచ్చిన్మయం*
*తత్ త్వం తత్త్వమిదం విచిన్తయ పరానన్దం పదం ప్రాప్స్యసి॥*

ఒక అంధత్వవిశేషము కండ్లున్నను వస్తుస్వరూపభానమును అరికట్టును. అట్టి అజ్ఞానాంధకారమునకు జన్మభూమియగు ఈసంసృతి అనెడు ప్రపంచమంతయు సంకల్పమాత్రముననే ఉద్భవించును. పర

మేశ్వరుడుకూడ "ఏకో౽హం బహు"స్యామ్" నేను ఒకడను, అనేక మందిని అగుదును." అని సంకల్పముచేసి సంసారమును సృజించెను. అటులనే, ఓరాజా! ఏరాజుకో కూతురు, "ఈమె నాభార్య" అని నీ వనుకొనినంతమాత్రమున నీభార్య అయినది. ఈ సంకల్పసృష్టియే నీసుఖదుఃఖములకు కారణము. ఇప్పుడు నీవు ఈసంసృతినుండి నివృత్తిని పొందగోరుచున్నచో సంకల్పమును మొదటికి పెరికి పార వేయుము. సంకల్పజన్యమగు మమత్వమును విసర్జించుము. అంతట నీకు వస్తువునందలి మమత్వమును విసర్జించినందున వస్తువుచే ఖేదము కలుగదు. పరమార్థవస్తువు దేశ, కాలములచే పరిచ్ఛిన్నము కాదు. అట్టి సద్రూపమును, చిద్రూపమును అగు బ్రహ్మము నీవే. ఈత త్త్వము నిరంతరమును చింతించుటద్వారా పరమానందపదమగు మోక్షమును పొందగలవు.

భర్తృహరి:— మహాత్మా, ఆశ అను నామాంతరముకల సంకల్పమును త్యజించితిని. తమ పాదపద్మములే శరణు.

గోరక్ష్:— సుఖముగా నుండుము. సమయానుకూలముగా అమృతీకరణమును పొందెదవు.

స్వా. ని. :— భర్తృహరిశతకమున భర్తృహరిచెప్పిన "ధిక తాం చ, తం చ, మదనం చ, ఇమాం చ, మాం చ" అనునది అసత్యమా?

స్వా. ప్రి. :— అది అధికపాఠము. అట్టివి ఇంకను చాలఉన్నవి.

## సద్గతిని సహగమనము చేయు వనిత పొందునా?

## వైధవ్యముతో జీవితముగడపునది పొందునా?

మూలాల్వాలారాజుగారు ప్రశ్నించిరి. సహగమనము చేసినచే సద్గతి కలుగునా? విధవకు కలుగదా?

స్వా. ప్రి. :— దక్షసంహిత చెప్పుచున్నది.

*వ్యాలగ్రాహీ యథా వ్యాలం బలాదుద్ధరతే బిలాత్ ।*
*ఏవముద్ధృత్య దూతేభ్యః పతిం స్వర్గం వ్రజేత్ సతీ ॥*

"పాములవాడు బిలములోనున్న సర్పమును బైటికి లాగికొని ఎత్తుకొని పోవునట్లు సహగమనము చేసిన వనిత యమదూతలనుండి భర్తను తీసికొని స్వర్గమునకు పోవును." చనిపోవుచున్న భర్తను యమదూతలు తీసికొనిపోవుచుండగా భార్యకు "నాభర్తను యమదూతలు తీసికొనిపోవుచుండగా నేను ఇక్కడ ఎందుకు ఉండవలెను" అని తోచును. తానుకూడ సహగమనముచేసి భర్తను యమదూతల నుండి లాగికొని స్వర్గమునకు తీసికొనిపోవును.

ఏకారణముచేతనైనను సహగమనముచేయనిచో ఆమె తన వైధవ్యమును పూర్తిగా నిర్వహించును.

"*జీవన్తీ చేత్త్యక్తకేశా తపసా శోధయేద్వపుః॥*"

"బ్రతికిఉన్నచో కేశములను విసర్జించి తపస్సుచే శరీరమును పరిశుద్ధము చేయవలెను." విధవాధర్మములను అనుసరించి రంగు బట్టలు, అలంకారములు, సుగంధపదార్థములు మొదలగు మోహ వర్ధకములగు పదార్థములను త్యజించి చాంద్రాయణాదితపములను చేసి తనశరీరమును శోషింపజేయును.

"*నారాయణస్య సేవాం కురుతే నిత్యమేవ చ॥*"

"నారాయణునికూడ నిత్యము సేవించును."

అనగా నారాయణుని విగ్రహమును ఎదుటనుంచుకొని నవవిధ ములగు భక్తులతోను నారాయణుని తనభర్తగా భావించి పూజిం చును. ఏలనన:—

*విష్ణోః సంపూజనం కార్యం పతిబుద్ధ్యా న చాన్యథా ।*

"విష్ణువును భర్తృభావముతోనే పూజించవలెను. వేరొకవిధ ముగా కాదు" అని చెప్పబడినది.

## మీరాబాయికి పరమాత్మయందుగల భర్తృభావము.

మూల్వాలా రాజుగారు మరల ప్రశ్నించిరి:—

మీరాబాయికి భర్త యుండెను. ఆయనను విడచి ఆమె ప్రభువును సేవించినది. ఆమెకు ప్రభువు ఎట్లు లభించెనో?

స్వా. ప్ర. — బాల్యకాలమున మీరాబాయి కొందరు చెలికత్తెలతో ఆడుకొనుచుండెను. ఆడుకొనుచు ఆచెలికత్తెలందరు తాము వరించిన ప్రియుల పేర్లను చెప్పుకొనిరి. ఒకామె తాను వరించినవ్యక్తి పేరు ప్రతాపసింహు డనెను. మరియొకఆమె కేసరీసింహు డనెను. ఈవిధముగనే సఖులుఅందరును చెప్పిరి. మీరాబాయివంతు వచ్చెను. ఆమె తలచెను. అయ్యో! అందరకును భర్తలు కలరే. నాకే భర్త లేకపోయెను. "నాకెందుకు లేడు" అని ఆమె దుఃఖించెను. అప్పటికి మీరాబాయి వయస్సు ఏడు, ఎనిమిది సంవత్సరములు. ఆమె తన తల్లిదండ్రులను అడిగెను. "నాస్నేహితురాండ్రు అందరకును భర్తలు కలరు. నాకు భర్త లేరా!" తల్లిదండ్రులు నవ్వుచు మీరాబాయితో నిట్లనిరి:— "నీభర్త గిరిధరుడే." ఈమాట విని మీరాబాయి చాల సంతోషించెను. అందరికంటెను నాభర్త గొప్పవాడని చెప్పుచు ప్రభుపరాయణయగు మీరాబాయి "గిరిధరా, గిరిధరా" అనుచు భక్తియందు నిమగ్నురాలయ్యెను. ఆమె తండ్రి సర్దారు. ఆయన మీరాబాయిపెండ్లి రాణాతో చేయుటకు ప్రయత్నించెను. ఇది తెలిసికొని మీరాబాయి ఖిన్నురాలయి పలికెను. "మీరు నాపెండ్లి గిరిధరునితో చేసిరి. నాభర్త గిరిధరుడే. ఇదేమిటి ఇట్లు చేయుచున్నారు? నన్ను వ్యభిచారిణిగా చేయుచున్నారా?" అని తాను పెండ్లిచేసికొననని పట్టుబట్టెను. తాను అవినాశియగు ప్రభువును పరిణయ మాడినందున ఇక వివాహము కూడదని పట్టు బట్టెను. ఈవిధముగ మీరాబాయి బాల్యమునుండియు ప్రభువునే

భర్తగా తలచి ఆయనయందు భక్తిని కలిగియుండెను. ఆమెదృష్టిలో ప్రభువుతప్ప వేరు భర్త లేనందున భర్తృవియోగముకూడ ఆవిడకు లేదు.

అప్పుడు రాజుగారు శ్రీ ప్రకాశానందస్వామివారిని ప్రశ్నించిరి. "మరల తమరు ఎప్పుడు దయచేయుదురు?"

స్వా. ప్ర. :—నానిర్ణయము ఏమియు లేదు. ఎప్పుడైన ఇటు వచ్చినచో తప్పక వచ్చెదను.

రాజు :—చాతుర్మాస్యలు సమీపించుచున్నవి. తమరు ఇచ్చటనే చాతుర్మాస్యలు గడపిన బాగుండును. తమకు అనుకూలముగానున్న ఏకాంతప్రదేశమున ఏరాట్లు చేసెదము.

స్వా. ని. :—పీఠడియాలో ఏకాంతస్థలము లేదు. కావున వారు ఇక్కడ ఉండు అవకాశము లేదు.

రాజు :—కమలేశ్వరమందిరము ఏకాంతముగా నుండునుకదా! అది వారికి అనుకూలముగా నుండును.

స్వా. ని. :—కమలేశ్వరమందిరము చాలదూరము. భిక్షమొదలగువానికి చాల ఇబ్బంది కలుగును.

రాజు :—దానికేమి? అక్కడనే వండించెదము. వంటమనిషిని, నౌకర్లను ఏర్పాటు చేయుదును. ఇంక లోపము ఏమి?

స్వా. ని. :—నాలుగువందల సంవత్సరములకు పూర్వము మద్రాసులో ఒక కోటీశ్వరుడగు నగరశ్రేష్ఠి ఉండెను. అతడు మహాధనవంతుడు. కుబేరుని అవతారము అని జనులు చెప్పుకొనెడివారు. ఒక్కప్పుడు ఆయన ఓడ ఒకటి దారి తప్పి తిరిగి రాలేదు. అందులో 60, 70 మంది నావికులును, రత్నపరీక్షకులును ఉండిరి. మూడు సంవత్సరముల తరువాత హఠాత్తుగా ఓడరేవునందలి సైనికుడు ఒక రాత్రి పన్నెండుగంటలకు వచ్చి మీ తప్పిపోయిన ఓడ వచ్చినదని

చెప్పెను. ఆఓడ తప్పుడు మార్గమున ఒకద్వీపమును చేరెను.ఆద్వీపము నందు రత్నపురాళ్ళు లభించెను. ఆవిధముగా విలువగల రత్నశిలలను నింపుకొని ఓడ మూడుసంవత్సరములకు మరలివచ్చెను.ఇది విని ఆతడు ఆనందముతో పొంగిపోయెను. ఆతడు బట్టలు వేసికొని రేవుకు చూచుటకు వెళ్ళెను. ఇంతలో ఆతని గురువునకు ఈసంగతి తెలిసెను. ఆతడు శ్రేష్ఠి ఇంటికి వచ్చెను. శ్రేష్ఠిభార్య "ఇక్కడే కూర్చొనుడు ఇప్పుడే వచ్చెదరు" అని చెప్పెను. గురువు వెళ్లిపోవలసియుండెను. ఆయన ఒక తాటాకు తెప్పించి దానిపై "ఒక విరిగిన సూదికూడ నీతో రాదు" అని వ్రాసెను. శ్రేష్ఠి ఇంటికి వచ్చినతరువాత ఈ తాటాకు ఇవ్వమని చెప్పి గురువు వెళ్ళిపోయెను. శ్రేష్ఠి ఓడల రేవునుంచి ఇంటికి వచ్చి ధోవతిని విడచి కౌపీనముతో స్నానము చేయ కూర్చొనెను. స్నానము చేయుచుండగా గురువుగారి తాళ పత్రమును భార్య ఇచ్చెను. అదిచదివి ఆశ్రేష్ఠి వెంటనే కౌపినముతోనే వెళ్లిపోయెను. అచ్చటినుండి ఆతడు సంచారముచేయుచు బదరీగిరి నగరమునకు వెళ్ళెను. అచ్చటి రాజుకూడ ఆతని దర్శనమునకు వచ్చెను. ఆయనకూడ చినిగినబట్ట కట్టుకొని ఆతనితో తిరుగసాగెను. ఈస్వామి కౌపీనమునుమాత్రమును ధరించెడివాడు. వారు ఇరువురును ఎక్కడో ఒకచోట దుమ్ములో చెట్టుక్రింద పడియుండెడివారు. అక్కడ ఈస్వామి పట్టణస్వామి అను పేరుతో వ్యవహరించబడెడు వాడు.

మద్రాసునకు చెన్నపట్టణము అను పేరు కలదు. దానిని ఆధారముగా చేసికొని ఆయనకు పట్టణస్వామి అను పేరు వచ్చెను. ఆయన సన్యాసిగా మారినపిమ్మట ఒకపద్యమునందు ఇట్లు చెప్పెను.

"సన్యాసి కుక్కవలె తినవలెను. నక్కవలె తిరుగవలెను. కుక్క ఇంటింటికి తిరిగి ఏది దొరికితే అదితిని సంతోషించును. అటు

లనే సన్యాసికూడ మానావమానములను లెక్కచేయకుండ ఏభిక్ష దొరికిన దానితోనే తృప్తిని పొందును. నక్క ప్రాణులన్నిటికంటెను ఎక్కువ జాగ్రత్త కలది. అందుచే జీవహింసచేయు ఇతరప్రాణులు ఏవియు దానిని చంపలేవు. అటులనే సన్యాసికూడ జగత్తునందు జాగ్రత్తగా ఉండి మాయాపాశమున చిక్కుకొనరాదు.

## గౌరాంగుడు ఉచ్ఛిష్టాన్నమును ప్రేమతో భుజించెను.

స్వా. ని. :—బెంగాలులో సప్తగ్రామజమీందారులగు హిరణ్యదాసుడు, గోవర్ధనదాసుడు అను ఇద్దరు సోదరులు ఉండిరి. వారిలో గోవర్ధనదాసునకు ఒకబిడ్డ పుట్టెను. ఆ ఒక్కబిడ్డతోనే ఆతడు చివరకు అమరత్వమును పొందెను. మహాత్ముడగు రఘునాథదాసునకు తండ్రియగు భాగ్యము ఆగోవర్ధనదాసునకు కలిగెను. కుటుంబమునకు ఏకైకపుత్రుడయినందున పెదతండ్రికిని, తండ్రికినికూడ ఆబాలుని యందు మిక్కుటమగు వాత్సల్యము ఉండెను. బాల్యమునుండియు రఘునాథదాసుడు గంభీరుడు.వినయవిధేయతలు గలిగియుండెను.సుందరాకారుడు. రాజపుత్రుడగుటచే ఇంకను ఎక్కువగా శోభించుచుండెను. కుమారుని పండితుని చేయవలెనను తలంపుతో తండ్రి బలరామాచార్యులవద్దకు పంపెను. ఆరోజులలో మహాత్ముడగు హరిదాసుగారు కూడ ఆ ఆచార్యులవద్దనే యుండి అహర్నిశలు భగవన్నామసంకీర్తనము చేయుచుండెడివారు. బాలుడగు ఆరఘునాథదాసు హరిదాసుగారి ధర్మనిష్ఠకు ఎంతయో లోబడిపోయెను. వారిరువురును పరస్పరము స్నేహభావముతో నుండిరి. పెద్దవాడైనపిమ్మట రఘునాథుని మనస్సును అనంతవైభవములు ఆకర్షించలేదు.విషయభోగములు విషముతో సమానముగా తోచసాగెను. వెండి, బంగారునాణెములను తనమార్గమునందలి కంటకములతో సమానముగా చూచుచుండెను. రాచకార్యములయందు ఆతని మనస్సు ఉండెడిది కాదు. రఘునాథదాసుని ఈప్రవర్తన చూచి తండ్రికి ఎంతయో విచారముగా నుం

డెను. అనేకవిధములగు విషయభోగములద్వారా ఆతని మనస్సును ఆకర్షించ ప్రయత్నించెను. కాని అవి అన్నియు వ్యర్థమైనపిమ్మట ఆతనికి ఒక సౌందర్యవతితో వివాహము చేసెను. రఘునాథుడు యువకుడైనందున, పరమసౌందర్యవతియగు భార్యను పొంది తన ఔదాసీన్యమును విడనాడి ఆప్రేమపాశమున బద్ధుడగునని తండ్రి ఆశయము. కాని తండ్రిచేసిన ఈప్రయత్నము నిష్ఫలమయ్యెను.

ఒకనాడు సమీపగ్రామమగు శాంతిపురమునందలి శ్రీఅద్వైతాచార్యులవద్దకు గౌరాంగప్రభులు వచ్చిరని తెలిసికొని రఘునాథదాసు అచ్చటికి వెళ్ళుటకు అనుమతించమని తండ్రిని కోరెను.

తండ్రి చెప్పెను:— "నాయనా, నీవు ఒకడవే నావంశదీపము. నీవే మాజీవితమునకు ఆధారము. మహాప్రభువుల దర్శనము చేయవద్దని నేననుట లేదు. వృద్ధుడగు నేను నిన్ను ప్రార్థించుచున్నాను. నా తెల్లవెండ్రుకలవైపు చూచి త్వరగా తిరిగి రమ్ము." రఘునాథుడు చెప్పెను. "తండ్రీ! నేనేమి చేయుదును? ఎందుచేతనో ఎవరికి తెలియును? సాంసారిక కృత్యములయందు నామనస్సు నిమగ్నమగుట లేదు. నావలన మీకు దుఃఖము కలుగరాదనియే కోరుచున్నాను. కాని నేనుమాత్రము నావశములో లేను. అయినను నేను తప్పక తమసేవకు హాజరగుదును." ఇట్లు చెప్పి రఘునాథదాసు శాంతిపురమునకు వెళ్ళెను. ప్రభువుల చరణములకు నమస్కరించి సంసారబంధమునుండి విముక్తి నొందించమని ప్రార్థించెను. ప్రభువులు చెప్పిరి. "ప్రస్తుతము ఇంటికి వెళ్ళుము. మానవునకు కలిగిన క్షణికవైరాగ్యము కష్టము కలిగినంతనే నశించును. ఇంకను కొన్ని రోజులు ఇంటిలో నుండుము. తరువాత చూడవచ్చును. ఇప్పుడు నేను బృందావనము వెళ్ళుచున్నాను. అక్కడినుండి పూరీజగన్నాథము వెళ్ళుదును. అక్కడ నన్ను కలసికొనుము." ప్రభువుల ఈసమాధా

నము రఘునాథుని సంతృప్తిపరచెను. ఆతడు ఇంటికి మరలెను. కొన్ని దినముల తరువాత ప్రభువులు పూరీజగన్నాథము వచ్చిరను సంగతి రఘునాథునకు తెలిసెను. అంతట అక్కడకు వెళ్లి ప్రభువులను దర్శించవలెనని రఘునాథుని మనస్సు తొందరపడసాగెను. నిద్రాహారములు లేవు. ఏదోవిధముగా పూరీ వెళ్ళవలెనని తలచెను. బైటకు పిచ్చివానివలె నటించెను. కొంతమంది రఘునాథదాసును గొలుసులతో కట్టమని సలహాచెప్పిరి. గోవర్ధనదాసు చెప్పెను. "నాయనలారా! రఘు పిచ్చివాడు కాడు. అతని పిచ్చి సాంసారిక బంధములను ఛేదించ గోరుచున్నది. అపారమగు సంపద, సౌందర్యవతియగు భార్య ఇంట నుంచలేకపోయినచో గొలుసులు ఇంట నుంచగలవా!" ఇట్లు చెప్పి రఘునాథుడు ఆజ్ఞానువర్తి అని తండ్రి ఎరిగియున్నందున నా ఆజ్ఞకాని, ఆచార్యుల అజ్ఞకాని లేకుండ ఇంటి నుండి బైటికి వెళ్ళరాదని విధించెను. ఇంకను తండ్రికి ధైర్యము చిక్కక రహస్యముగా అతనిపై పహరా విధించెను. ఎల్లవేళలయందును ఎవడో ఒకడు అతనితో నుండెడివాడు. ఒకనాటి సంధ్యాకాలమునందు బలరామాచార్యులు ఏదియో పనియుండి వచ్చిరి. మాట్లాడిన తరువాత ఇంటికి మరలిపోయిరి. రఘునాథుడుకూడ ఆయనతో వెళ్లెను. ఆసమయమున రఘునాథుని తండ్రిగారు ఎక్కడికో బైటికి వెళ్ళియుండిరి. ఆచార్యులతోకూడ నుండుటవలన రఘునాథుని ఎవ్వరును ఆపలేదు. కూడా ఎవ్వరును రాలేదు. మాటలు చెప్పుచు రఘునాథుడు ఆచార్యుని ఇంటివరకు వెళ్లెను. రఘునాథుడు పలికెను. "అయితే వెళ్ళుదునా!" ఆచార్యులు చెప్పిరి. "ఓహో! మాటలలో ఏమియు తెలియనేలేదు. ఇంటినుండి చాలదూరము వచ్చివేసితివి. వెళ్ళుము. వెంటనేవెళ్లి చేయదగినపనిని చేయుము." ఇది గురువాజ్ఞగా భావించి రఘునాథుడు అచ్చటినుండి తిన్నగా పూరీ

వెళ్ళెను. వైరాగ్యభూషణుడగు రఘునాథదాసు పూరీవచ్చి గౌరాంగప్రభువులచెంత నుండెను. వారి ప్రసాదమునే ఐదారురోజులవరకు తీసికొనెను. కాని ఇది తగదు అనుకొనెను. జగన్నాథుని మందిర సింహద్వారమున భక్తులు ప్రసాదమును భిక్షుకులకు పంచిపెట్టెదరు. ఇది తెలిసికొని భిక్షుకులమధ్య కూర్చొని దొరికినదానితో సంతృప్తి పడుచుండెను. భిక్షుకుల గుంపు త్రోపిడివలన ఒక్కొక్కప్పుడు రఘునాథునకు ప్రసాదము కూడ దొరకెడిదికాదు. అప్పుడు స్వస్థానమునకు వచ్చి జలమును మాత్రము త్రాగి వెళ్ళెడివాడు. నాలుగైదు రోజుల తరువాత గౌరాంగప్రభువు "రఘునాథుడు ఇక్కడ భోజనము చేయుట లేదు, ఎక్కడ తినుచున్నాడు" అను సందేహము కలిగి ఒక భక్తుని అడిగెను. సింహద్వారమువద్ద భిక్షుకులతోపాటు కూర్చొని అడిగికొని లభించినది తినుచున్నాడని భక్తుడు చెప్పెను. గౌరాంగుడు ఎంతయో ఆనందించి చెప్పెను. "నిజముగా రఘువు రత్నము. ఆతనికి నిజముగు వైరాగ్యము కలదు. గౌరవము, ఇంద్రియభోగములు, రుచి, సిగ్గు మొదలగువానిని ఆతడు లక్ష్యపెట్టుటలేదు. సన్యాసిజీవితము గడపుచు పరాధీనుడుగా నుండువాడు కుక్కతో సమానము. సన్యాసి భిక్షచేసి భుజించుటయే యుక్తము." కొంతకాలమైనతరువాత ఒకమనుష్యుడు రఘునాథదాసు తండ్రికి తెలిపెను. "కొద్దిరోజులకు పూర్వము వేలకొలది జనులకు యజమానిఅయి, వేలకొలదిమందిచే తన ఆజ్ఞలను పాటింపజేయు నీకుమారుడు రఘునాథుడు ఇప్పుడు ముష్టివేసిన అన్నముకొరకు జగన్నాథుని సింహద్వారమున గంటలకొలది నిలబడి ఉండును." తండ్రి చెప్పెను. "ఇంతవైరాగ్యముకల కుమారుడు నాకు కలిగినందున నేను ధన్యుడను." అనంతరము తండ్రి ఒకనికి నాలుగు వందల రూపాయలు ఇచ్చి పూరీ పంపెను. వంటమనిషిని, నౌకరును ఉంచి రఘునాథుని భోజనమునకు అన్ని ఏర్పాట్లు చేయుమనెను.

(నాలుగువందల రూపాయలు అనగా ఆరోజులలో ఒకమనిషికి ఒక మాసమునకు ఎనిమిదిఅణాలు సరిపోవుచుండెడివి.) సేవకుడు పూరీ వెళ్ళి రఘునాథునకు అన్ని సంగతులను తెలిపెను. రఘునాథుడు ఆలోచించెను. ఇంటిని, కుటుంబమును, పరివారమును సమస్తమును త్యజించిన నాకు తండ్రిపంపిన రూపాయలతో పని ఏమి? ఈసమయమున రూపాయలు తీసికొనుట అధర్మము.

భాగవతమున వ్రాయబడినది:—

"యః ప్రవ్రజ్యా గృహాత్ పూర్వం త్రివర్గావపనాత్ పునః।
యది సేవేత తాన్ భిక్షుః స వై వాన్తాశ్యపత్రపః॥

ధర్మము, అర్థము, కామము అను మూడు పురుషార్థములను ఇచ్చు గృహస్థాశ్రమమునుండి–ఇంటినుండి బయటకు వచ్చి సన్యాసము తీసికొనినతరువాత గృహస్థధర్మములను–విషయాదులను సేవించినచో ఆసన్యాసికి సిగ్గులేదని చెప్పవచ్చును. అతడు కక్కిన కూడు తినుచున్నాడు. కావున నేను ఆడబ్బు స్పృశించుటకూడ తగదు." ఇట్లు తలచి సేవకుని ఇంటికి తిప్పి పంపెను. జనులు ఆతనిని గుర్తించిరి. అందుచే ఆతనికి భిక్ష అధికముగా లభించుచుండెను. ఇది కాంచి భిక్షాటనమును మానివేసెను. అంతటినుండి భిక్షుకులతోబాటు క్షేత్రమునకు వెళ్లి ప్రసాదమును తీసికొని వచ్చెడివాడు. ఈసంగతులు గౌరాంగప్రభువులకు తెలిసెను. వారు చెప్పిరి. "రఘు సర్వోత్తమము పని చేసెను. సింహద్వారముముందు భిక్షకొరకు వేచియుండుట వేశ్యావృత్తి. నోటితో నామజపము చేయుచున్నను చిత్తమునందు ఆవృత్తియే ఉండును. ఎవడైన భిక్షవేసినచో బాగుండునని తోచును." ఇట్లు జరుగుచుండగా రఘునాథుడు ఒకమారు అన్నక్షేత్రమునకు వెళ్లి భిక్షతీసికొనివచ్చి నామసంకీర్తనము చేయుచుండెను. ఇంతలో స్వరూపగోస్వామి అచ్చటకు వేంచేసిరి. వారు అడిగిరి. "రఘు సింహ

ద్వారము చెంత భిక్ష ఎందుకు మానివేసెను?" సంగతి తెలిసికొని స్వరూపగోస్వామి పలికిరి. "చాలచిత్రము, వైరాగ్యమునందు ఏమాత్రము లోపము కన్పించినను వెంటనే ఆపని మానివేయును. సింహద్వారమునందలి భిక్షలో ఆయన ఏదియో దోషమును కాంచి ఉండవచ్చును."

ప్రభువు పలికిరి:- "ఇందుకు నేను ఎంతయో సంతోషించుచున్నాను." రఘునాథదాసు తనవద్ద ఒక చినిగిన బొంతమాత్రము ఉంచుకొనెడివాడు. రోజుకు రెండుగంటలు మాత్రమే నిద్రించెడివాడు. మిగిలిన సమయమంతయు ఇష్టదేవతా స్మరణముతో గడపెడివాడు.

ఆయన తితిక్ష, సహనశీలత, జిహ్వాసంయమము,అకించనత్వము హద్దులను దాటియుండెను. అన్నక్షేత్రమునందుకూడ ఆయనకు పారతంత్ర్యము కానవచ్చుచుండెను. క్షేత్రాధికారులు ఆయనకు ఎక్కువగా భిక్ష పెట్టుచుండిరి. అందుచే అన్నక్షేత్రమునకు వెళ్ళుటకూడ మానివేసెను.జగన్నాథమునందలి దుకాణములలో భగవానునిప్రసాదము అమ్ముచుందురు. రెండుమూడు రోజులవరకు అమ్ముడు అవని ప్రసాదము కుళ్ళిపోవును. కుళ్ళినప్రసాదము వీధులలో పారవేయుదురు. పూరీలో పెద్దపెద్ద తెలుగుఆవులు చాల ఉండును. కడుపు నిండ ఈఅన్నము తినినతరువాత ఆవులు మిగతా అన్నమును వదలివేయును.సాయంకాలసమయమువ రఘునాథదాసువెళ్లి ఈ అన్నము తీసికొని నీటిలో కడిగికొనెడివాడు. బెడ్డలు, రాళ్లు ఉన్నచో ఏరి పారవేసెడివాడు. తరువాత దీనిలో బెల్లము కలుపుకొని తినెడివాడు. ఈ విధముగా తనరోజులు గడపెడివాడు. ఒకరోజున రఘునాథదాసుని ప్రవర్తన అంతయు ఎవరో ప్రభువునకు తెలిపిరి. వారి ఆనందమునకు అంతు లేదు. ఆరోజు సాయంకాలమే ఆయన రఘునాథదాసు ఉన్న

చోటికి వెళ్లిరి. అప్పుడు ఆతడు తన రుచికల పైనచెప్పబడిన భోజనమును భుజించుచుండిరి. గౌరాంగప్రభువులు నెమ్మదిగా అచ్చటకు వెళ్ళి వానివెనుక నిలబడిరి. తన వెనుక ఎవరో ఉన్నసంగతి రఘునాథునకు తెలియదు. ఆయన ఒకకబళము నోటిలో నుంచుకొను సమయమున ప్రభువులు నెమ్మదిగా ఇట్లు పలికిరి. ఏమయ్యా, ఇంత రుచికల పదార్థమునుకూడ ఒంటరిగా ఎవరికిని తెలియకుండ తినుచున్నావే? నాకు కొంచెము ఇవ్వవా?"

ఇట్లు పలికి ప్రభువులు వానిపాత్రనుండి తొందరగా ఒక గుప్పెడు అన్నము తీసికొని తననోటిలో పెట్టుకొనెను.

"అయ్యో, అయ్యో" అనుచు అత్యంతకరుణార్ద్రస్వరముతో ఏడ్చుచు ఆపాత్రను రెండుచేతులతోను మూసివేసి రఘునాథుడు పలికెను. "ప్రభూ, తమరు ఇదేమి చేయుచున్నారు? స్వామీ! ఈ అన్నము తమకు తగదు. ఈకుళ్ళిన ఉచ్ఛిష్టాన్నమును తిని నన్ను పాపాత్ముని చేయకుడు."

ఇంతలో నోటిలో నుంచుకొనిన ముద్దను తినివేసి గౌరాంగుడు రెండవ ముద్దకొరకు చేయిచాచెను. ఈ గందరగోళము విని స్వరూప గోస్వామికూడ అచ్చటకు వచ్చిరి. ప్రభువులు రఘునాథదాసుని దగ్గరనుండి అన్నము తీసికొనుట చూచి వారి చేతులు పట్టుకొని స్వరూపగోస్వామివారు ఇట్లు పలికిరి. "ప్రభూ ఇది తమకు తగదు." వారు ఆకుళ్లిన అన్నమును మ్రింగుచు ఇట్లనిరి. "స్వరూప్‌జీ! నేను నిజము చెప్పుచున్నాను. నేటి అన్నము నాకు ఉన్నంత రుచిగా మరి ఏపదార్థమును ఎప్పుడును ఉండలేదు."

వైరాగ్యమనగా ఇదియే.

కావున తమరు మహాదేవమందిరములో వంట ఏర్పాటుచేసెదమనిన ప్రకాశానందస్వామివారు ఎట్లు అంగీకరింతురు?

స్వా. ప్రి. :—పూర్వము కాషాయవస్త్రములు ధరించి చాతుర్మాస్యలు చేయుచుండెడివాడను. ఇప్పుడు ఒక స్థిరమగు చోటు లేదు. స్థిరముగా నుండను. చాతుర్మాస్యలుకూడ చేయుట లేదు.

స్వా. ని. :—తమవంటివారలకు చాతుర్మాస్యల బంధము ఉండదు.

స్వా. శంకరా. :—(వినోదముతో) సన్యాసులు చాతుర్మాస్యలను పాలించవలెనే? లేనిచో స్వచ్ఛందులని చెప్పబడెదరు.

స్వా. ప్రి. :—(వినోదముతోనే) సన్యాసులు చాతుర్మాస్యలను పాలించుటకంటె ముఖ్యము ధనాదులయందు అపరిగ్రహమును కలిగియుండుట. ముఖ్యమైనవాటిని మీరు పాలించుట లేదు. పైగా గౌణములగు చాతుర్మాస్యాదులయందు మీరు పట్టుదల కలిగియున్నారు. ఒకాయన భైయాజీ (అతిచాదస్తులను భైయాజీఅందురు) ఎడమచేయి బైటఉంచుకొని ఒంటిచేతితో వంటచేసికొని భుజించెడివాడట. ఒకడు ఇది చూచిఅడిగెను. ఏమండీ వంటచేయునప్పుడు ఈ ఎడమచేయి దూరముగా ఎందుకు ఉంచుచున్నారు?

భైయాజీ :—ఇది అపవిత్రములగు కార్యములు చేయును. అందుచే బైట ఉంచుచున్నాను.

మనుష్యుడు :—అపవిత్రకార్యము చేయు చేతిని బైట ఉంచుచున్నారు. కాని అపవిత్రములగు పదార్థములను (మలమూత్రాదులను) లోపలనే ఉంచుకొనుచున్నారే! ఆ అపవిత్రపదార్థములను కూడ బైటనే ఉంచి కూర్చొనరాదా?

అందరు నవ్విరి.

ఇదేవిధముగా శంకరానందస్వాములు అత్యంతనిషిద్ధమైనదానిని (ధనమును) ఇష్టదేవునిగా భావించి కూర్చొనియుండిరి.

స్వా. శం. :—"నేను ధనము ఉంచుకొనను. నేను కాగితపు నోట్లు ఉంచుకొనెదను. అవి ఉంచుకొనరాదను నియమము సన్యాసులకు లేదు.

ఇది విని అందరు ఇంకను నవ్విరి.

రాజుగారు :— (నిత్యానందులవైపు చూచి) బాపూజీ (స్వా. ప్రే.) ఏసత్కారము చేసినను ఏమియు స్వీకరించరు. ఒంటరిగా డబ్బులేకుండా ఎక్కడకు వెళ్లినను వారికి శ్రమ ఉండదా?

స్వా. ని. :—మనదృష్టికి అట్లుండును. శంకరభగవత్పాదుల వాక్యములు పరికింపుడు :-

నిర్ధనోఽపి సదా తుష్టోఽప్యసహాయో మహాబలః ।

నిత్యతృప్తోఽప్యభుఞ్జానోఽప్యసమః సమదర్శనః॥

"జ్ఞాని ధనము లేకపోయినను ఎల్లప్పుడును సంతృప్తితో నుండును. కూడా ఎవరును లేకపోయినను ఆతడు మహాబలసంపన్నుడే. విషయ పదార్థములను అనుభవించకపోయినను ఆత్మరసముచే తృప్తితోనే ఉండును. సర్వత్ర సమదృష్టితో నుండుటచే ఆయనతో సమానుడెవ్వడును ఉండడు."

స్వా. ప్రే. :— స్వామీ! తమరు నన్ను అట్టివ్యక్తితో సాటివానిగా తలచుట నాకు యుక్తముగా తోచుటలేదు.

స్వా. ని. :— అదేమి కాదు. మిమ్ములనుగూర్చి నేను ఏమియు చెప్పుటలేదు. ప్రసంగము వచ్చినందున జ్ఞానిలక్షణము చెప్పుచున్నాను. రాజులకుకూడ కలుగని ఉత్తమస్థితినిగురించి చెప్పుచున్నాను. వీరందరు రాజ్యభోగములతో మహదానందము పొందుచున్నా మనుకొనెదరు. కాని వీరికి రాజ్యవైభవములను విసర్జించిననాడే యథార్థమగు ఆనందము కలుగును.

శాస్త్రములుకూడ ఘోషించుచున్నవి.

*రసం బ్రహ్మ విబోధ్యాశ్చ తృప్తో యః పరమాత్మని ।*
*ఇన్ద్రంచ మన్యతే రఙ్కం నృపాణాం తత్ర కా కథా॥*

"బ్రహ్మానందమను రసమును అనుభవించినవాడు, పరమాత్మను పొందుటచే ఆనందించినవాడు ఇంద్రుని ఆనందమునుకూడ అతి క్షుద్రముగా భావించును. ఇక రాజుల ఆనందముసంగతి చెప్పనేల?"

స్వామిశ్రీప్రకాశానందులవారు వెళ్లుటకు ప్రయత్నము చేసి నప్పుడు రాజుగారు తనమనిషికి చెప్పిరి. "మొన్ననే తెప్పించిన క్రొత్త మోటారు తీసికొని రమ్ము." మోటారువచ్చినతరువాత స్వామివారిని అందు కూర్చుండబెట్టి రాజుగారు పలికిరి. "స్వామీ! ఇది చాలా మంచిమోటారు. మొన్నమొన్ననే క్రొత్తగా తెచ్చితిమి."

స్వా. ప్ర. :— నేను వెళ్లిన ప్రతిచోట చిన్నచిన్న పిల్లలు నావద్దకు కార్లు, రైళ్లు మొదలగు ఆటవస్తువులను తీసికొనివచ్చి ఆడు చుందురు. చిన్నవాళ్ళకు చిన్నబొమ్మలు, పెద్దవాళ్ళకు పెద్దబొమ్మలు.

ఇదివిని స్వామి నిత్యానందులవారు నవ్వుచు ఇట్లనిరి. "నిజమే. మీామనస్సునకు మోటారు వాహనము. స్వామివారి మనస్సునకు మాత్రము అది ఆడుకొనుబొమ్మ."

అనంతరము స్వామి నిత్యానందులవారి ఆజ్ఞ తీసికొని స్వామి ప్రకాశానందులవారు మొదలగువారు అందరును రాజకోట వెళ్లిరి.

—0—